News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS చంద్రకాంత్

తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :192 | ఖమ్మం | మంగళవారం, ఆగస్టు 26, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## బీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు వర్తించేది 5.8 శాతమే

10 శాతమంటూ భాజపా తప్పుడు ప్రచారం
కేటీఆర్‌కు చెల్లితో ఆస్తి పంచాయితీ
పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



బీసీ రిజర్వేషన్లు 42 శాతంలో ముస్లింలకు 5.8% మాత్రమే వర్తిస్తుందని, ఇప్పటికే అది 4 శాతంగా ఉందని.. కావాలని 10% అంటూ భాజపా తప్పుడు ప్రచారం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. జనహిత పాదయాత్రలో భాగంగా సోమవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటాయపల్లి, వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో జరిగిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ 'రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండాపోయింది. 10 మంది ఎమ్మెల్యేల సంగతి తర్వాత.. ముందు కవితతో ఉన్న కుటుంబ ఆస్తుల పంచాయితీని కేటీఆర్ తేల్చుకోవాలి. కరీంనగర్‌లో ఒకే ఇంట్లో 40 ఓట్లున్నాయి. ఓటు చోరీ జరిగిందనేందుకు ఇది నిదర్శనం. భాజపాలోని

వివరాలు 2లో..

## సీఎంకు ధైర్యముంటే పోలీసులు లేకుండా ఓయూకు వెళ్లాలి


మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధైర్యముంటే పోలీసు భద్రత లేకుండా ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెదేపాలో ఉన్న రేవంత్‌రెడ్డిని ఓయూ విద్యార్థులు తరిమికొట్టిన విషయాన్ని గుర్తుచేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం ఇందిరాపార్కు వద్ద ఆశావర్కర్లు నిర్వహించిన ధర్నాకు హరీశ్‌రావు మద్దతు తెలిపారు.

వివరాలు 2లో..

## అనుమతి లేకపోతే కేబుల్ వైర్లు తొలగించొచ్చు



హైదరాబాద్: విద్యుత్ స్తంభాలపై ఇంటర్నెట్, కేబుల్ వైర్ల తొలగింపుపై సోమవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఇటీవల రామంతాపూర్ విద్యుత్ ప్రమాద ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్ల వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ వ్యాప్తంగా విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్లను సిబ్బంది తొలగిస్తున్నారు.

వివరాలు 2లో..



# త్వరలో 40వేల ఉద్యోగాలు



అధికారం చేపట్టిన వందరోజుల్లో 55 వేల ఉద్యోగాలిచ్చాం. 11 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. అన్ని వర్సిటీలకు ఉపకులపతులను నియమించాం. సహాయ, సహ ఆచార్యుల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాం. సీఎం రేవంత్

- 'ఉస్మానియా'ను ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ వర్సిటీల్లా మారుద్దాం
- భారత రాష్ట్ర సమితి మళ్లీ అధికారంలోకి వస్తే.. వర్సిటీని లేఅవుట్లుగా చేసి అమ్మేస్తుంది
- విద్యార్థులూ.. గంజాయి, డ్రగ్స్ మత్తులో మునగకండి
- 15 రోజుల్లో కోదండరాంను ఎమ్మెల్సీని చేస్తాం.. ఎవరడ్డుకుంటారు?
- ఉస్మానియా విశ్వవిద్యాలయం వసతి గృహాల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

త్వరలో ప్రభుత్వంలోని ఖాళీలను గుర్తించి 40 వేల పోస్టులు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రూ.80 కోట్లతో నిర్మించిన విద్యార్థుల వసతి గృహాలను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఠాగూర్ ఆడిటోరియంలో విద్యార్థులు, ఆచార్యులనుద్దేశించి మాట్లాడారు.' 'ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్రం అవిభక్త కవలలు.. ప్రత్యేక రాష్ట్ర మలిదశ ఉద్యమంలో రాజకీయ నాయకులు, పార్టీలు కాడి కింద పడేసినప్పుడు ఓయూ ప్రాంగణం ఊపిరిపోసింది. ప్రొఫెసర్ కోదండరాం రాజకీయ జేఏసీ పోరాటం, తెలంగాణ బిడ్డలు శ్రీకాంతాచారి, యాదయ్యల ఆత్మబలిదానంతో ఉద్యమం తారస్థాయికి వెళ్లింది. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీ నరసింహారావు, ఉత్తమ పార్లమెంటేరియన్ జైపాల్‌రెడ్డి, ఉద్యమస్ఫూర్తిని రగిలించిన జార్జిరెడ్డి, గద్దర్‌లు ఈ యూనివర్సిటీ బిడ్డలే. అలాంటి ఓయూను గత పదేళ్లలో పట్టించుకోలేదు. నిర్వీర్యం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఓయూ అభివృద్ధికి వేగంగా చర్యలు తీసుకున్నాం. ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ వర్సిటీల్లా మారుద్దాం. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిన 'కాళేశ్వరం' పాపాలే భరిస్తున్నాం.. ఓయూ అభివృద్ధికి రూ.3 వేల కోట్లు ఇవ్వలేమా. ఓయూకు వచ్చేందుకు పోలీసులు ఆంక్షలు విధించారంటూ విమర్శించారు. విద్యార్థులతో మాట్లాడేందుకు వచ్చా. డిసెంబరులో మళ్లీ వస్తా. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో సభపెట్టాలి. వర్సిటీలో ఒక్క పోలీస్ కూడా లేకుండా ఆదేశాలిస్తా. వర్సిటీ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందిస్తే వెంటనే అమలు చేస్తా. ఓయూలో వసతి గృహాలను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వీసీ ప్రొఫెసర్

వివరాలు 2లో..

## యూరియా కోటా సాధించే వరకూ పోరాడతాం

- రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి ప్రేరేపిత ఆందోళనలు జరుగుతున్నాయి
- రైతులకు మంత్రి తుమ్మల బహిరంగ లేఖ



తెలంగాణకు కేటాయింపుల మేరకు యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. రాష్ట్ర కోటా సాధించే వరకూ పోరాడతామంటూ సోమవారం ఆయన రాష్ట్ర రైతులకు బహిరంగ లేఖ విడుదల చేశారు. "కేంద్రం వానాకాలం సీజన్ వరకు 8.30 లక్షల టన్నుల యూరియా ఇవ్వాలి. ఇప్పటికి 5.72 లక్షల టన్నులే వచ్చింది. అందులో దిగుమతి యూరియా 3.96 లక్షల టన్నులకు 2.10 లక్షల టన్నులు, దేశీయ యూరియా 1.69 లక్షల టన్నులకు 1.06 లక్షలు టన్నులు మాత్రమే వచ్చింది.

వివరాలు 2లో..



## యూరియా కష్టాలు..

### పంపిణీ కేంద్రాల వద్ద రైతుల బారులు

యూరియా కోసం తెలంగాణలో పలుచోట్ల రైతులు పడిగాపులు కాస్తున్నారు. పంపిణీ కేంద్రాల వద్ద సోమవారం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. నల్గొండ జిల్లాలోని త్రిపురాంతకం, శాలిగౌరారం పీఏసీఎస్‌ల వద్ద క్యూలైన్లలో ఆధార్ కార్డులు, చెప్పులుపెట్టి నిరీక్షిస్తున్నారు. సూర్యాపేట జిల్లా అనంతగిరిలో ఉదయం 5 గంటల నుంచే రైతులు క్యూ కట్టారు. పలు కేంద్రాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు పహారా కాస్తున్నారు.మెదక్ జిల్లా శివ్వంపేటలో సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. పాదరక్షలు, ఇటుకలు, రాళ్లతో నర్సాపూర్-తూప్రాన్ 161ఏఏ జాతీయ రోడ్డు వరకు ఉంచారు.

ఇటీవల భారీ వర్షాలు కురవడంతో గత కొన్ని రోజులుగా యూరియా కొరతతో తెల్లవారుజామున నుంచి వందలాది మంది రైతులు, మహిళలు చిన్న పిల్లలను ఎత్తుకుని గంటల తరబడి క్యూలో ఉన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందేలా చర్యలు చేపడుతున్నారు.

## దమ్ముంటే దొంగ ఓట్ల లెక్క తేల్చండి

### కాంగ్రెస్‌కు డీకే అరుణ సవాల్

- తెలంగాణలో దొంగ ఓట్లతోనే బీజేపీ ఎంపీల గెలిచారన్న టీపీసీసీ అధ్యక్షుడు
- మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలతో వివాదం
- అధికార మదంతో కాంగ్రెస్ నేతల అడ్డగోలు మాటలని అరుణ విమర్శ



తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధిం చిన 8 స్థానాలు దొంగ ఓట్ల పుణ్యమేనంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఈ ఆరోపణలపై మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహేశ్ గౌడ్ వ్యాఖ్యలను ఖండించిన ఆమె... కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే దొంగ ఓట్ల వ్యవహారాన్ని తేల్చాలని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా డీకే అరుణ మీడియాతో మాట్లాడుతూ... "దొంగ ఓట్ల గురించి కాంగ్రెస్ పార్టీ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. అలాంటి ఓట్లతో గెలిచే అలవాటు కాంగ్రెస్‌కే ఉంది. ఓటమి ఎదురైనప్పుడు మాత్రమే వారికి ఫేక్ ఓట్లు గుర్తుకొస్తాయి" అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్,

వివరాలు 2లో..

## మండలానికో 'జన ఔషధి' స్టోర్... బీసీ యువతకు ఉపాధి

- వైద్య రంగంపై సీఎం చంద్రబాబు సమీక్ష
- అధికారులకు కీలక ఆదేశాలు
- ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ. 25 లక్షల వరకు ఆరోగ్య బీమా విస్తరణ
- ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు ప్రణాళిక
- కుప్పంలో 45 రోజుల్లో ఉచిత వైద్య పరీక్షల పైలట్ ప్రాజెక్టు పూర్తికి ఆదేశం
- యోగా, నేచరోపతి ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు, యూనివర్సిటీ ఏర్పాటు యోచన

వివరాలు 2లో..



## ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్...



- రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభం
- విజయవాడలో ఇంటింటికీ వెళ్లి కార్డులు అందజేసిన మంత్రి నాదెండ్ల మనోహర్
- మొత్తం 4.42 కోట్ల మంది లబ్ధిదారులకు కొత్త కార్డులు
- సెప్టెంబర్ 15 నాటికి పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యం
- క్యూఆర్ కోడ్ స్కాన్‌తో పారదర్శకత, ఎక్కడైనా రేషన్ పొందే సౌకర్యం
- సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 1967 ఏర్పాటు

వివరాలు 2లో..

## ఆ విషయంలో అంబటి రాంబాబుకు ఆస్కార్ ఇవ్వొచ్చు

- పోలవరంపై చర్చకు రావాలని అంబటి సవాల్ విసరడం సిగ్గుచేటన్న నిమ్మల
- అబద్ధాలు చెప్పడంలో అంబటికి ఆస్కార్ ఇవ్వొచ్చని వ్యాఖ్య
- మంత్రిగా పని చేసినా ప్రాజెక్టుపై అంబటికి అవగాహన లేదని విమర్శ



మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు అబద్ధాలు చెప్పడంలో దిట్ట అని, ఆయనకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టుపై

వివరాలు 2లో..

# త్వరలో 40వేల ఉద్యోగాలు

కుమార్ తదితరులు

**నిస్పృహతో భారత రాష్ట్ర సమితి దుష్ప్రచారం**

అబద్ధాల సంఘం పేరుతో వాట్సప్.. సామాజిక మాధ్యమాలతో పబ్బం గడుపుతున్న భారత రాష్ట్ర సమితి మళ్లీ అధికారంలోకి వస్తే ఓయూను లే–అవుట్లుగా వేసి అమ్మేస్తుంది. అధికారం పోయిందన్న నిస్పృహతో ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోంది.. రాష్ట్రంలో ఎక్కడా ఏనుగులు, సింహాలు లేవు... కంచ గచ్చిబౌలి భూముల్లో కృత్రిమమేధ సాయంతో ఏనుగులు, సింహాలను సృష్టించారు. వాటిని చంపుతున్నామంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే.. తండ్రీకొడుకులు అసహనానికి గురవుతున్నారు. ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ వద్దంటూ రూ.కోట్లు ఖర్చుచేసి సుప్రీంకోర్టు వరకూ వెళ్లారు. ఎందుకంటే వారికి మినహా ఎవరికీ పదవి ఉండొద్దు. ఇదేం పైశాచిక ఆనందం? మరో 15 రోజుల్లో కోదండరాను ఎమ్మెల్సీని చేస్తా. ఎవరడ్డుకుం టారు. విద్యార్థులు చదువుకుంటామంటే.. గొర్రెలు, బర్రెలు, చేపల రుణాలిప్పిస్తామంటూ మోసాలకు పాల్పడ్డారు. గంజా యి, డ్రగ్స్ నిర్మూలనకు ఈగిల్ ఫోర్స్ తీసుకొస్తే వద్దంటు న్నారు. హైడ్రాను ససేమిరా అంటున్నారు. సన్నబియ్యం..రే ంషన్ కార్డులొద్దు అంటున్నారు. వీరు నిజంగా తెలంగాణ సమాజానికి పట్టిన చెదలు. మేం ఇందుకు విరుద్ధం.. మా పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లుగా మారాలి. విద్యార్థులూ వారి ఉచ్చులో పడకండి.. మా మంత్రులందరూ అందుబాటులో ఉంటారు. విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి సమస్యలున్నా చెప్పండి. వాటిని పరిష్కరించే పూచీ నాది.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రైవేటు రంగంలో 1.50 లక్షల మందికి ఉద్యోగాలు ఇప్పించాం.

**చదువొక్కటే మీ తలరాతను మారుస్తుంది**

'ఇంజినీరింగ్, డిగ్రీ చదివే కొందరు విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడ్డారు. మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. మీకు మంచి భవిష్యత్తు ఉంది.. డ్రగ్స్.. గంజాయి మత్తులో పడకండి.. చదువొక్కటే మీ తలరాతను మారుస్తుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం సహా రాష్ట్రంలోని ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో చదువుకున్న వారంతా గొప్ప వ్యక్తులుగా మారారు. పిన్నవయసులోనే ఐపీఎస్‌గా మారిన సీవీ ఆనంద్, టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం మీకు ఆదర్శప్రాయులు. ఓటు హక్కును రాజీవ్‌గాంధీ 18 ఏళ్లకు తగ్గించినా... శాసనసభల్లో పోటీకి 25 ఏళ్ల నిబంధన అలాగే ఉంది. దీనిపై ఓయూలోని మేధావులు, ఆచార్యులు ఆలోచించండి.. యువ నాయకత్వ అవసరం రాష్ట్రానికి ఉంది. తెలంగాణలో 18–31 సంవత్సరాలున్న వారు 65 శాతం మంది ఉన్నారు. వీరిలో కొందరు సింగపూర్, అమెరికాలకు వెళ్లి అక్కడ సంపద సృష్టిస్తున్నారు. మన యువకులు మన రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి" అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. సింగరేణి కాలరీస్, హెచ్ఎండీఏలు ప్రాయోజితులుగా ఉన్న ఉపకార వేతనాల పథకాలను సీఎం ఆవిష్కరించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఐఏఎస్‌లు యోగితారాణా, శ్రీదేవసేన, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ఉస్మానియా వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, జేఎన్‌టీయూ వీసీ టి.కె.కె.రెడ్డి, అంబేద్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# మండలానికో 'జన ఔషధి' స్టోర్... బీసీ యువతకు ఉపాధి

- మొదటి పేజి తరువాయి

భావిస్తున్న ముఖ్యమంత్రి... దీనికి సంబంధించి వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకున్నారు. జనఔషధి స్టోర్లు పెట్టేందుకు బీసీ కార్పొరేషన్ నుంచి పెద్దఎత్తున వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తక్షణమే వాటికి అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో పేదలకు తక్కువ ధరకే మెడిసిన్స్ లభించడమే కాకుండా, బీసీ యువతకు విస్తృతంగా ఉపాధి లభించేందుకు మార్గం సుగుమం అయ్యింది.

**రూ.25 లక్షల వరకు వైద్య బీమాపై కసరత్తు**

ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.25 లక్షల వరకు వైద్య బీమా అందించే అంశంపైనా సమీక్షలో చర్చించారు. ప్రస్తుతం ఉన్న విధానం ద్వారా 1.43 కోట్ల కుటుంబాలకు మాత్రమే లబ్ది కలుగుతుండగా, దీనిని 1.63 కోట్ల కుటుంబాలకు వర్తించేలా మార్పులు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇది అమలైతే 5.02 కోట్ల మందికి ప్రయోజనం కలుగుతుందని అధికారులు తెలిపారు.

**ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి**

ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రిని నిర్మించేలా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. మార్కాపురం, మదనపల్లి, పులివెందుల, ఆదోనిలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల పురోగతిపైనా చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి వెయ్యి మంది జనాభాకు 2.24 బెడ్స్ ఉండగా, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిర్దేశకాల ప్రకారం 3 బెడ్లు ఉండాలని సూచించిందని అన్నారు. దీనిప్రకారం రాష్ట్రంలో మరో 12,756 పడకలు అందుబాటులోకి తేవాల్సి ఉందని.... దీనిపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

**ఆరోగ్య సూత్రాలు పాటించేలా అవగాహన**

వివిధ వ్యాధులతో చికిత్స పొందేందుకు ఆసుపలకు రావడం కన్నా... అనారోగ్యం పాలవ్వకుండా ముందగానే జాగ్రత్తపడేలా, ప్రజలంతా ఆరోగ్య సూత్రాలు పాటించేలా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇందుకోసం యోగా, నేచురోపతిని ప్రమోట్ చేసేలా 'యోగా ప్రచార పరిషత్' ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 3 రీజనల్ స్టడీ సెంటర్లలో 64 మంది సభ్యులను నియమించేందుకు అనుమతించారు. అమరావతి పరిధిలో నేచురోపతి యూనివర్సిటీ ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు

**45 రోజుల్లోగా కుప్పంలో ఉచిత వైద్య పరీక్షలు**

రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించే క్రమంలో తలపెట్టిన ఉచిత వైద్య పరీక్షల పైలెట్ ప్రాజెక్టును కుప్పం నియోజకవర్గంలో 45 రోజుల్లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, శాంతిపురం, రామకుప్పంతో పాటు మరిన్ని ల్యాబ్ టెస్టింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, అలాగే శాంపిల్ కలెక్షన్ టీమ్‌లు పెంచాలని స్పష్టం చేశారు.

**ప్రతీ గ్రామానికి 'ఆరోగ్య రథం'**

'ఆరోగ్యం రథం'తో ప్రతీ పల్లెలోనూ మొబైల్ వైద్యసేవలు అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. 108 వాహనాల సిబ్బందికి యూనిఫామ్ అమలు చేయాలని నిర్దేశించారు. మరోవైపు ఎన్టీఆర్ బేబీ కిట్స్ పథకాన్ని అమలు చేసేందుకు అధికారులు తీసుకొచ్చిన పలురకాల కిట్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. బేబీ కిట్స్ పథకం త్వరలోనే అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**మోడల్ ఇంక్లూజివ్ సిటీగా అమరావతి**

పెర్కిన్స్ ఇండియా – ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యంతో అమరావతిలో 'మోడల్ ఇన్‌క్లూజివ్ సిటీ' ఏర్పాటుకు ముందుకొచ్చాయి. దీనిపై ఆ సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర విద్య, సమాన హక్కులు, అందరికీ

అందుబాటులో మౌలిక వసతులను సృష్టించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. బారియర్ ఫ్రీ పబ్లిక్ ప్లేస్, ఇన్‌క్లూజివ్ రోడ్ డిజైన్, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రజా రవాణా సౌకర్యాలు రూపకల్పన, డిజిటల్ స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ మోడల్ స్కూల్ ప్రోగ్రామ్స్ ద్వారా ప్రతి పిల్లవాడు తన సహచరులతో సమానంగా నేర్చుకునే వాతావరణం కల్పించడం, ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు వంటివి చేస్తామని చెప్పారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రావాలని సూచించారు.

# బీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు వర్తించేది 5.8 శాతమే

- మొదటి పేజి తరువాయి

బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పదవుల కోసం భయపడుతూ.. బీసీ రిజర్వేషన్ల చట్టంపై మాట్లాడలేకపోతున్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టం కోసం పోరాడుతున్న రేవంత్‌రెడ్డిని నేను బీసీ బిడ్డగా చూస్తా' అని చెప్పారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ బిహార్‌లో ఓటర్ల జాబితాల్లో తప్పులను ప్రశ్నిస్తే.. తమ నేత రాహుల్‌ను లక్ష్యంగా చేసుకొని ఈసీ విమర్శలు చేస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి కొండా సురేఖ, ఎంపీ బలరాంనాయక్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. మరో విడత జనహిత పాదయాత్ర 28న నకిరేకల్ నియోజకవర్గం పరిధిలో, 29న అచ్చంపేట నియోజకవర్గంలో జరగనుంది.అంతకు ముందు గంగాధరలో ఆదివారం రాత్రి కార్యకర్త ఇంట్లో బస చేసిన మీనాక్షి నటరాజన్ ఉదయాన్నే స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహ ఆవరణలో శ్రమదానం చేశారు. మూత్రశాలలను స్వయంగా శుభ్రపరిచారు. ఆమె వెంట మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు.

# సైన్యం చేతిలో పాకిస్థాన్.. ప్రధాని ఓ కీలుబొమ్మే

- పాక్‌లో అప్రకటిత సైనిక పాలనపై సంచలన నివేదిక
- అధికారాన్ని చేజిక్కించుకున్న ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్
- ప్రజాస్వామ్య ముసుగులో నియంతృత్వ పాలన అంటూ విశ్లేషణ
- ఎన్నికల్లో రిగ్గింగ్, చట్టసభలు పూర్తిగా నిర్వీర్యం
- తన పదవీకాలాన్ని తానే పొడిగించుకున్న సైన్యాధిపతి
- ప్రధాని, పార్లమెంట్ కేవలం నామమాత్రమేనని వెల్లడి



గతంలో సైనిక పాలకులు రక్తపాతం ద్వారా అధికారాన్ని చేజి క్కించుకోగా, ప్రస్తుత ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఎలాంటి ఆర్భాటం లేకుండానే దానిని సొంతం చేసుకు న్నారని ఒక నివే దిక సంచలన విషయాలు వెల్లడించింది.

ఆయన ప్రజాస్వామ్య ముసుగులో ఆధునిక నియంతృత్వాన్ని పరిపూర్ణం చేశారని పేర్కొంది. పౌర ప్రభుత్వాన్ని కీలుబొమ్మగా మార్చి, దేశంలో అప్రకటిత సైనిక పాలన సాగిస్తున్నారని జియోపొలిటికల్ విశ్లేషకుడు మాటియో బియాంచి 'యూరోపియన్ టైమ్స్'లో రాసిన కథనంలో విశ్లేషించారు.

మాటియో బియాంచి కథనం ప్రకారం, 2022 నవంబర్‌లో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అసిమ్ మునీర్ వ్యూహాత్మకంగా పాకిస్థాన్‌లోని ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ పార్టీని అధికారంలోకి రాకుండా అడ్డుకునే లక్ష్యంతో 2024 సాధారణ ఎన్నికలను పాక్ చరిత్రలోనే అత్యంత అనుమానాస్పదంగా నిర్వహించారు. సైన్యం చెప్పినట్లు నడుచుకునే విధేయులైన రాజకీయ నాయకులను అధికారంలో కూర్చోబెట్టారు. దీంతో, దేశ పార్లమెంట్ సైనిక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసే ఒక కమిటీగా మారిపోయిందని ఆయన పేర్కొన్నారు.అధికార పీఠంపై షరీఫ్‌లు, భుట్టో–జర్దారీ కుటుంబాలు ఉన్నప్పటికీ, వారు కేవలం సైనిక పాలనకు పౌర ముసుగు వేయడానికే పరిమితమయ్యారని బియాంచి విశ్లేషించారు. నిజమైన అధికారం మొత్తం మునీర్ చేతుల్లోనే ఉందని, దేశంలో కీలక నిర్ణయాలన్నీ సైనిక ప్రధాన కార్యాలయంలోనే తీసుకుంటారని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవహారాలను సైతం పౌర ప్రభుత్వ పర్యవేక్షణ లేకుండా, నేరుగా సైన్యం నియంత్రణలో ఉండే 'స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటేషన్ కౌన్సిల్' (ఎస్ఐఎఫ్‌సీ) ద్వారా నడిపిస్తున్నారని వివరించారు.మునీర్ తన అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు అనేక చర్యలు తీసుకున్నారని ఆ నివేదిక తెలిపింది. 2025 మే నెలలో ఆయనకు 'ఫీల్డ్ మార్షల్' హోదా కల్పించారు. పాక్ సైన్యంలో పనిచేస్తున్న ఏ చీఫ్‌కు ఇప్పటివరకు ఈ హోదా దక్కలేదు. అంతేకాకుండా, దేశ రెండో అత్యున్నత సైనిక పురస్కారం 'హిలాల్–ఎ–జురత్'ను కూడా ఆయనే స్వీకరించారు. ఆర్మీ చీఫ్‌కు పైఅధికారి ఎవరూ ఉండనందున, ఇది తనకు తాను ఇచ్చుకున్న బహుమతి లాంటిదని బియాంచి అభిప్రాయపడ్డారు.ఇక 2024 నవంబర్‌లో, తన మూడేళ్ల పదవీకాలాన్ని ఐదేళ్లకు పొడిగిస్తూ పార్లమెంట్‌లో ఒక బిల్లును ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదింపజేశారు. ప్రజాస్వామ్య ముసుగును కాపాడుతూనే, ఎన్నికలు, పార్లమెంట్, న్యాయవ్యవస్థ వంటి వ్యవస్థలను లోపల డొల్లగా మార్చారని ఆ నివేదిక పేర్కొంది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఒక దేశాధినేతగా కాకుండా, మునీర్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని మాటియో బియాంచి తన కథనంలో ముగించారు.

## ఆ విషయంలో అంబటి రాంబాబుకు ఆస్కార్ ఇవ్వొచ్చు

- మొదటి పేజి తరువాయి

చర్చకు సిద్ధమా అంటూ అంబటి విసిరిన సవాల్‌పై ఆయన ఘాటుగా స్పందించారు. ప్రాజెక్టును పూర్తి చేయకుండా చేతులెత్తేసిన వ్యక్తి ఇప్పుడు చర్చకుపిలవడం సిగ్గుచేటని విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు. "జలవనరుల శాఖ మంత్రిగా పనిచేసినప్పటికీ అంబటికి పోలవరం ప్రాజెక్టుపై కనీస అవగాహన కూడా లేదు. మా పార్టీలోని సాధారణ కార్యకర్తలకు ఉన్న పరిజ్ఞానం కూడా ఆయనకు కొరవడింది" అని వ్యాఖ్యానించారు.

గత వైసీపీ ప్రభుత్వ అసమర్థ విధానాల వల్లే పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని నిమ్మల రామానాయుడు ఆరోపించారు. "ఆనాడు వారు చేసిన పాపం వల్ల ఈరోజు రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఈ నష్టానికి వారే పూర్తి బాధ్యత వహించాలి" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో తమ ఉనికిని కాపాడుకోవడం కోసమే వైసీపీ నేతలు నిరాధారమైన సవాళ్లు విసురుతున్నారని ఆయన విమర్శించారు.

## ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్...

రాష్ట్రంలో కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ప్రారంభమైంది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం విజయవాడ, పెనమలూరు ప్రాంతాల్లో స్వయంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు కార్డులను అందజేసి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.42 కోట్ల మంది లబ్ధిదారులకు ఈ స్మార్ట్ కార్డులను అందించనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 15వ తేదీలోగా రాష్ట్రంలోని ప్రతి లబ్ధిదారుని ఇంటికి స్మార్ట్ కార్డును చేర్చేలా లక్ష్యం నిర్దేశించుకున్నామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో 5.90 లక్షల మందికి, కృష్ణా జిల్లాలో 5.17 లక్షల మందికి ఈ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కొత్త కార్డుల ద్వారా లబ్ధిదారులు రాష్ట్రంలోని ఏ చౌకధరల దుకాణంలోనైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కలుగుతుందని స్పష్టం చేశారు. ఈ స్మార్ట్ కార్డులో ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారుడు ఎప్పుడు, ఎక్కడ సరుకులు తీసుకున్నాడనే సమాచారం నేరుగా ప్రభుత్వానికి చేరుతుందని, దీనివల్ల పంపిణీ వ్యవస్థలో పూర్తి పారదర్శకత సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 29 వేల రేషన్ దుకాణాల ద్వారా ప్రజల అవసరాలకు అనుగుణంగా కందిపప్పు, పామాయిల్, గోధుమలు వంటివి సరఫరా చేస్తున్నామని, ఇందుకోసం పీఓఎస్ మిషన్లను కూడా అప్‌గ్రేడ్ చేశామని అన్నారు. గిరిజన, మారుమూల ప్రాంతాల ప్రజల సౌకర్యం కోసం సబ్–రేషన్ డిపోల ఏర్పాటుపై ముఖ్యమంత్రితో చర్చిస్తున్నట్లు తెలిపారు. కార్డులో పేర్ల మార్పులు, చేర్పుల కోసం స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏవైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## దమ్ముంటే దొంగ ఓట్ల లెక్క తేల్చండి

- మొదటి పేజి తరువాయి

బీజేపీ చెరో 8 స్థానాలు గెలుచుకున్నాయని, అలాంటప్పుడు దొంగ ఓట్లతో బీజేపీ మాత్రమే ఎలా గెలుస్తుందని ఆమె ప్రశ్నించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌ల మధ్య నలిగిపోతున్న మహేశ్ కుమార్ గౌడ్, తీవ్ర నిరాశతో ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని డీకే అరుణ విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని ఆరోపించారు. బలహీనవర్గాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే రేవంత్ రెడ్డిని పదవి నుంచి తప్పించి బీసీ నేత అయిన మహేశ్ కుమార్ గౌడ్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారం తలకెక్కి కాంగ్రెస్ నేతలు మతిభ్రమించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సీఎంకు ధైర్యముంటే పోలీసులు లేకుండా ఓయూకు వెళ్లాలి

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత రాష్ట్ర సమితి హయాంలో నిర్మించిన భవనాన్ని ప్రారంభించడానికి సీఎం ఓయూకు వెళ్లారని, ఈ క్రమంలో మూడు రోజుల ముందు నుంచే విద్యార్థులను అరెస్టు చేశారని ఆక్షేపించారు. ఆశ కార్యకర్తలకు రూ.18 వేల స్థిర వేతనం సహా ఇచ్చిన హామీలను ఎప్పటికి నెరవేరుస్తారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోటా సాధించే వరకూ పోరాడతాం

- మొదటి పేజి తరువాయి

రామగుండంలోని ఎరువుల కర్మాగారం నుంచి మొత్తం కేటాయింపులు తెలంగాణకే జరపాలని కోరితే 40 శాతమే ఇచ్చారు. కేంద్రం, భాజపా నేతలు వారి అసమర్థతను రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారు. రాష్ట్రంలో రైతుల ముసుగులో భారత రాష్ట్ర సమితి ప్రేరేపిత ఆందోళనలు జరుగుతున్నాయి. సొసైటీ కార్యాలయాల వద్ద చెప్పులు క్యూలైన్లలో పెట్టించడం, పుట్టినరోజు

వేడుకల పేరిట యూరియా బస్తా బహుమానంగా ఇవ్వడం వంటి వాటితోపాటు మహిళల ద్వారా సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాలంటే మిగతా కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలి. నానో యూరియా సరఫరా పెంచాలి. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు. పాత నిల్వలతో కలిపి 7.32 లక్షల టన్నుల యూరియా పంపిణీ చేయిస్తున్నాం. కేంద్రంపై పోరాడి పూర్తి కోటా సాధిస్తాం' అని తుమ్మల లేఖలో తెలిపారు.


## అనుమతి లేకపోతే కేబుల్ వైర్లు తొలగించొచ్చు

- మొదటి పేజి తరువాయి

దీంతో ఎయిర్‌టెల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అనుమతి తీసుకున్న కేబుళ్లను సైతం తొలగిస్తున్నారని సంస్థ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఏయే స్తంభాలకు అనుమతి తీసుకున్నారో చూపించాలని టీజీఎస్పీడీసీఎల్ తరఫు న్యాయవాది కోరారు. వాదనలు విన్న ధర్మాసనం అనుమతిలేని కేబుళ్లను తొలగించొచ్చని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# రాష్ట్ర కన్వీనర్ గా శ్రీకోటి జలంధర్ చారి




**ఆగస్టు 25 ( సీ కే న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ధూప, దీప, నైవేద్య కన్వీనర్ గా జన్నారం మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన శ్రీ కోటి జలంధర్ సారీ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాదులోని హబ్సిగూడలో జరిగిన సమావేశంలో ఆయనను రాష్ట్ర కన్వీనర్ గా నియమిస్తూ అధ్యక్షులు పి.శ్రీకాంత్ ఆచార్యులు ఆదేశాలు జారీ చేసి నియామక పత్రాన్ని అందజేశారు. శ్రీ కోటి జలంధర్ చారి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ కమిటీల నిర్మాణం, సభ్యత్వ నమోదు నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర కన్వీనర్ గా నియమితులైన శ్రీకోటి జలంధర్ చారిని పలువురు అభినందించారు.

# వ్యవసాయ పంటలకు సంపూర్ణంగా యూరియా ఎరువులు ఇవ్వాలి అని డిమాండ్ చేస్తూ సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో, కొణిజర్ల తాసిల్దార్ కార్యాలయం ధర్నా



**కొనిజర్ల ఆగస్టు 25 ( సీ కే న్యూస్)** వ్యవసాయ పంటలు సాగు చేస్తున్న సమయంలో యూరియా కొరత ఏర్పడటం వల్ల రైతులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే వ్యవసాయ పంటలకు సంపూర్ణంగా యూరియా ఎరువులు అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కొనిజర్ల మండల సమితి ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు రైతు సంఘం కొనిజర్ల మండల సమితి ఆధ్వర్యంలోకొనిజర్ల మండల తాసిల్దార్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్యాలయము ధర్నా నిర్వహించారు తాసిల్దార్ కి వ్యవసాయ శాఖ అధికారి వినతి పత్రం అందజేశారు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ జిల్లా రైతు సంఘం కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు లు పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్ పంటలు సాగు చేసే సమయంలో కేంద్ర ప్రభుత్వం రైతుల పంటలకు యూరియా ఎరువును సరఫరా చేయకుండా తెలంగాణ రైతులను ఇబ్బందులు గురిచేస్తుందని వారి ఆరోపించారు బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారుల వచ్చినప్పుడు నుండి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా రైతులపై సవితి తల్లి ప్రేమను అవలంబిస్తుందని వారు పేర్కొన్నారు దేశానికి అన్నం పెట్టే రైతులను ఇబ్బంది పెట్టే దుర్మార్గమైన ఆలోచన బిజెపి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం చేయటం వారి పతనానికేనని వారు ఆరోపించారు యూరియా ఎరువులు రైతులకు అందించడంలో నితిష్టమైన ప్రణాళికలో లేకపోవడం రైతులు వ్యవసాయ పనులు వదిలిపెట్టి యూరియా ఎరువు కోసం పడిగాపులు కాస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే వ్యవసాయ పంటలకు సరిపడా యూరియా ఎరువులు సంపూర్ణంగా అందించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వారి విజ్ఞప్తి చేశారు ధర్నా కార్యక్రమంలో జిల్లా నాయకులు స్వర్ణ రమేష్ తోటపల్లి సీతారాములు మండల అధ్యక్షులు దేరంగులలక్ష్మయ్య కార్యదర్శి సోమయ్య పెద్దమల్ల రత్తయ్య చింతల ఆదినారాయణ బుఖ్య సూర్యం కొమ్మినేని వెంకయ్య అడపా బాబు పుట్ట సత్యనారాయణ చింతలాదిరెడ్డి కొమ్మినేని నరసరావు సూరంపల్లి రమేష్ ఎర్ర శ్రీను తుప్పతి రామారావు తమ్మిశెట్టి ఉపేందర్ చల్లా గోపాలకృష్ణ రవి తదితరులు పాల్గొన్నారు

# మార్కెఫెడ్ ద్వారా పెసలు పంటలు కొనుగోలు చేయాలి, దొండపాటి



**ఖమ్మం ఆగస్టు 25 ( సీ కే న్యూస్)** ఖరీఫ్ సాగులో పండించిన పెసర పంటను మార్కెఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ జిల్లా కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు జిల్లా ఉపాధ్యక్షులు భాగం ప్రసాద్ కలిసి సోమవారం నాడు కలెక్టర్కు వినతి పత్రాన అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫానుకు పెసర పంట కొంత నష్టం జరిగిందని ఇంటికొచ్చిన పెసర పంటను దళారీలు తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని దీనివల్ల పెసర పంట రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు తక్షణమే ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా కేంద్రాలు ఏర్పాటు చేసి పెసర పంటను కొనుగోలు చేసి రైతుల్ని ఆదుకోవాలని వారు తెలంగాణ రాష్ట్ర సంఘం తరపున కోరారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పెదమల్ల రత్తయ్య స్వర్ణ రమేష్ వెంకటి నరసరావు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# రాజీవ్ స్వగృహ ఫ్లాట్ కొరకు 2 లక్షలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 8 టవర్ లలో అసంపూర్తిగా ఉన్న 576 ఫ్లాట్ లను రిజిస్టర్ చేసుకునే ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయింపు
- లాటరీ పద్ధతిలో రిజిస్టర్ చేసుకున్న ఉద్యోగులకు ఫ్లాట్ ల కేటాయింపు
- రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ పై సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్




**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -25:** రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ లో ఫ్లాట్ కొరకు ఆసక్తి గల ఉద్యోగులు ఆగస్టు 30 లోపు 2 లక్షల రూపాయలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్ రెడ్డి లతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ పై సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ ప్రాజెక్టు 9 ఎకరాల 22 గుంటలలో నిర్మించిన 8 టవర్లలో అసంపూర్తిగా ఉన్న 576 ఫ్లాట్ లను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ చేసి సమావేశం నిర్వహించామని, గజం భూమి 1150 రూపాయల ధర నిర్ణయించామని అన్నారు. జలజ టౌన్ షిప్ లో ఉన్న 8 టవర్లు ఉద్యోగులకు లాటరీ పద్ధతిన అందించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. సొంత ఇళ్ళు కావాలని ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఈ లాటరీలో పాల్గొని తమ కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. రివర్ వ్యూ తో టవర్స్ బాగా ఉన్నాయని, ఖమ్మం నగరంలో అభివృద్ధి త్వరగా జరిగే ప్రాంతంలో ఈ టవర్లు ఉన్నాయని తెలిపారు. ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి వల్ల రోడ్డు కనెక్టివిటీ పెరుగుతుందని, మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్ నిర్మాణంతో వరద ముంపు ఇకపై ఉండదని అన్నారు. టౌన్ షిప్ వద్ద 60 అడుగుల రోడ్డు, జలజ టౌన్ షిప్ కు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆసక్తి గలవారు ఫ్లాట్ పొందవచ్చని అన్నారు. రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జలజ టౌన్ షిప్ లో 9.22 ఎకరాల విస్తీర్ణంలో 8 టవర్ లలో మొత్తం 576 ఫ్లాట్స్ నిర్మించడం జరిగిందని అన్నారు. చదరపు గజానికి 1150 రూపాయల ధర నిర్ణయించామని అన్నారు. భవన నిర్మాణ నాణ్యతలో ఎటువంటి లోపాలు లేవని అన్నారు. జలజ టౌన్ షిప్ లోని ఫ్లాట్లు ప్రభుత్వ ఉద్యోగులకు విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆసక్తి గల ఉద్యోగులు ఫ్లాట్ కోసం రెండు లక్షల రూపాయలు చెల్లించి సెప్టెంబర్ 8న జరిగే లాటరీలో పాల్గొన్నాలని అన్నారు. లాటరీ విధానం ద్వారా టౌన్ షిప్ అలాట్ మెంట్ జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ధర చదరపు గజానికి 1150గా నిర్ణయించిందని, మనం కొనుగోలు చేసి మరో 1100 రూపాయలు ఖర్చు చేసుకుంటే అన్ని సౌకర్యాలతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందని అన్నారు. టిజిఓ జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ టౌన్ షిప్ లో ఫ్లాట్ కొనుగోలు చేయడం వల్ల జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం ఉండదని అన్నారు. ఉద్యోగులకు బ్యాంకర్లు రుణాలు అందించేందుకు కూడా సుముఖంగా ఉన్నారని అన్నారు. ఉద్యోగులు ప్రస్తుతం రెండు లక్షల రూపాయలు చెల్లించి బుక్ చేసుకుంటే తర్వాత మనకు బ్యాంకు రుణాలు దొరుకుతాయని అన్నారు. జలజ టౌన్ షిప్ లో ఇప్పటి వరకు 76 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగిలిన ఇండ్ల కోసం ఆసక్తి గలవారు రెండు లక్షల రూపాయలు చెల్లించి రిజిస్టర్ చేసుకోవాలని అన్నారు. టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ అసోసియేషన్, హౌజింగ్ బిల్డింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూములు ఇవ్వవద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల దృష్ట్యా, ఉద్యోగస్తుల సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ లో ఉన్న 576 ఫ్లాట్ లను 1150 రూపాయలకు అందించాలని నిర్ణయించామని అన్నారు.

మరో 1350 రూపాయలు చదరపు గజానికి చెల్లిస్తే పెండింగ్ నిర్మాణ పనులు పూర్తి చేయడంతో పాటు ఫ్లాట్ అందించడం జరుగుతుందని అన్నారు. 28 లక్షలతో ఒక ఫ్లాట్ మనకు వస్తుందని ఆసక్తి గల ఉద్యోగులు త్వరగా తమ పేరు నమోదు చేసుకోవాలని అన్నారు.

ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి....



జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -25:** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం అందించాలని, మన పరిధిలో చేయగలిగిన పనిని వెంటనే పూర్తి చేయాలని, మనం చేయలేని పక్షంలో దానికి గల కారణాలను, నిబంధనలను వివరిస్తూ సమాధానం ఇవ్వాలని సూచించారు. బోనకల్ మండలం చిరునోముల గ్రామానికి చెందిన నిమ్మతోట నాగయ్య తనకు నాగార్జునసాగర్ కాలువ బోనకల్ బ్రాంచ్ పరిధిలో 5 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉందని, ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా లష్కర్ గా నియామకం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఇరిగేషన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కమీషన్ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డీలర్లకు కమీషన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కు రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

ఖమ్మం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్ మార్క్ ఫెడ్ ద్వారా ఖరీఫ్ పెసర పంటను కొనుగోలు చేయుటకు ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎం మార్క్ ఫెడ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొణిజెర్ల మండలం తనికెళ్ళ గ్రామానికి చెందిన ప్రజలు తనికెళ్ళ గ్రామం నుంచి బోడ్యా తండా గ్రామానికి వెళ్లే డొంక రహదారి ఆక్రమణకు గురవుతుందని, డొంక రహదారికి ప్రభుత్వం సర్వే చేసి అభివృద్ధి చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు రాస్తూ చర్యలు చేపట్టాలని అన్నారు.ఖమ్మం నగరం గాంధీ చౌక్ కు చెందిన రేపాల వెంకటరావు, నూతన రైల్వే 3వ లైన్ కొరకు తన ఇంటి స్థలం 24 గజాలు తీసుకొని 25 లక్షల నష్టపరిహారం చెల్లించారని, లూప్ లైన్ కొరకు మరో 17 చదరపు గజాలు జూలైలో తీసుకున్నారని, దీనికి నష్టపరిహారం 17 లక్షలు తక్షణమే చెల్లించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు రాస్తూ రైల్వే శాఖతో సమన్వయం చేస్తూ త్వరగా నష్టపరిహారం చెల్లించేలా చూడాలని అన్నారు. ఖమ్మం నగరానికి చెందిన యనమందల కృష్ణ బాబు తన కుమారుడు తెలంగాణ సాధన కోసం ఆత్మబలిదానం చేసుకున్నాడని, తన కోడలికి అమరవీరుల కుటుంబానికి అందించే ప్రభుత్వ ఉద్యోగం అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఆర్వో కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర నిర్లక్ష్యంతో తెలంగాణకు యూరియా కొరత




**ఆగస్టు 25 (సీ కే న్యూస్) చేగుంట :** కేంద్ర నిర్లక్ష్యంతో తెలంగాణ రాష్ట్రానికి యూరియా కొరత వివరాల ప్రకారం, తెలంగాణ రాష్ట్రనికి రావలసిన యూరియా, సకాలంలో కేంద్ర ప్రభుత్వం అందించకపోవడం రైతులు ఆందోళన చెందుతున్నారు, తెలంగాణకు రావలసిన మిగులు యూరియా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా రావాల్సింది ఉంది, కానీ కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాల్సిన యూరియా ఇవ్వకపోవడంతో రైతులు అయోమయం లో ఉన్నారు ఇప్పటికైనా తెలంగాణ రావాల్సిన యూరియా కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించాలి, చేగుంట మండల కేంద్రంలో సోమవారం నాడు రైతుసేవ కేంద్రానికి మరియు రావడంతో రైతన్న ఉదయాన్నే, రైతుసేవ కేంద్రంనీకి చేరుకుని, ఉనారు సమాచారం తెలుసుకున్న చేగుంట సబ్ ఇన్స్పెక్టర్, చైతన్యకుమార్ రెడ్డి, ఆగ్రో సెంటర్ వద్దకు పోలీసులు పంపిచారు, పోలీసులు కూడా రైతులకు సూచనలు ఇచ్చి, మీరు క్యూలైన్లో నిలిచి యూరియ తీసుకోవాలని రైతులను కోరారు, వారు వారి సలహా మేరకు, రైతులు ఎవరికి ఇబ్బందులు కలవకుండా ఉండి క్యూ పద్ధతి పాటించారు, పోలీస్ సహకారంతో అందరికీ యూరియా మా అందరికీ అందింది అని వారు సంతోషించారు అలానే చేగుంట పోలీస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు,

# ధర్మసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థుల ఎన్నికలు





**సి కే న్యూస్ ఆగస్టు 25 సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు జరుగు ప్రక్రియ విద్యార్థులకు తెలియజేసేందుకు మాదిరి ఎన్నికలు పాఠశాల సోషల్ సైన్సెస్ క్లబ్ ఆధ్వర్యంలో రామకృష్ణ సమన్వయకర్తగా నిర్వహించారు. ఎన్నికల విధానంలో ప్రధాన ఘట్టాలైన నామినేషన్ వేయడం, తిరస్కరణ ,బ్యాలెట్ పేపర్ తయారీ ,ఓటర్ల నమోదు, గుర్తింపు కార్డులు, సీక్రెట్ బ్యాలెట్ విధానం, కౌంటింగ్ ప్రక్రియ ,గెలిచిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రం అందజేత తదితర విషయాలు ప్రత్యక్షంగా తెలియజేసేలా ఈ మాదిరిగా ఈ మాదిరి ఎన్నికల నిర్వహణ తోడ్పడిందని పాఠశాల ఇంచార్జ్ ధర్మ ప్రకాష్ తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, సురేష్, పద్మజ , రాజమ్మ, కిరణ్మయి ,ప్రసన్న తదితరులు పాల్గొన్నారు .అత్యధిక ఓట్లు సాధించిన రామ్ చరణ్ స్కూల్ పీపుల్స్ లీడర్ గా, మధుప్రియ డిప్యూటీ స్కూల్ పీపుల్స్ లీడర్గా ,లాస్య ,మనోజ్, భానులు స్కూల్ క్యాబినెట్ సభ్యులుగా ఎన్నికయ్యారని నిర్వాహకులు తెలియజేశారు.



ఖేడ్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యంలో ఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి అరుణ్ మాట్లాడుతూ.. నియోజకవర్గం మొత్తం రోడ్లు అధ్వానంగా మారాయని, వాటిని మరమ్మతులు చేయాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. వారిని గద్దె దించే దాకా బుద్ధి రాదని పేర్కొన్నారు.

# రేషన్ షాపు ల బంద్ సిద్ధమైన రేషన్ డీలర్లు




- వచ్చేనెల 5న రాష్ట్ర వ్యాప్త రేషన్ షాపు ల బంద్
- 5 నెలల కమీషన్ డబ్బులు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రేషన్ డీలర్లు
- గౌరవ వేతనం , కమిషన్ పెంపు కొరకు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేత

**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి (వెంకటేష్) ఆగస్టు25:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఊకే శేఖర్ రావు ఆధ్వర్యంలో వచ్చేనెల 5న రాష్ట్ర వ్యాప్త రేషన్ డీలర్లు సమ్మె, గౌరవ వేతనం , కమిషన్ పెంపు కొరకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ కీ రేషన్ డీలర్లు వినతి పత్రం అందజేశారు . కాంగ్రెస్ ప్రభుత్వం డీలర్ల కొరకు మానిఫెస్టో లో పెట్టిన 5000 రూ.ల గౌరవ వేతనం,మరియు 300 రూ. కమీషన్ పెంపు ను వెంటనే ప్రకటించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ కి ఇచ్చిన వినతి పత్రంలో ప్రధాన డీలర్ల సమస్యలు

1. రేషన్ షాపులను మిని సూపర్ మార్కెట్లుగా గుర్తించి మరిన్ని నిత్యావసర సరుకులను పేద ప్రజలకు అందుబాటులోకి తేవాలి.
2. దుమ్ము, దూళితో తరుచూ అనారోగ్యం పాలవుతున్న రేషన్ డీలర్ల కుటుంబాలకు హెల్త్ కార్డులు జారీ చేయాలి.
3. బియ్యం దిగుమతి చార్జీలను ప్రభుత్వమే భరించాలి.
4. రేషన్ డీలర్ చనిపోతే రేషన్ డీలర్ కుటుంబానికి దహన సంస్కారాలకు రూ.30000 చెల్లించాలి.
5. గత 10 సం.లుగా పేరుకుపోయిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలి.
6. గోదాముల నుండి భారీ ఆన్లైన్ వెయింగ్ కాంటాల(లారీని తూకం వేసే విదంగా)ద్వారా రేషన్ షాపులకు సరుకుల పంపిణీ జరిగేలా గోదాం ప్రాంగంణంలో శాశ్వత ప్రతిపదికన వే-బ్రిడ్జిలు ఏర్పాటు చేయలి.
7. పోర్టబిలిటీ సిస్టం వచ్చినందున రేషన్ కార్డుల బైఫర్గెషన్ విదానాన్ని నిలుపుదల చేసి, కొత్త షాపుల ఏర్పాటు రద్దు చేయాలి. అత్యవసరమయితే గ్రామీణ ప్రాంతాల్లో 800 కార్డులు, పట్టణ ప్రాంతాల్లో 1200 కార్డులకు పైబడి ఉన్న రేషన్ షాపులను మాత్రమే బైఫర్గెషన్ చేయాలి.
8. కరోనాతో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబాలకు 20 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా అందించాలి.
9. ప్రతి రెండు సంవత్సరాలకి ఒకసారి చేపట్టే మా ఆథరైజేషన్ రినీవల్స్ ను ఎలాంటి రినీవల్స్ లేకుండా శాశ్వత ప్రాతిపదికన కొనసాగించాలి.
10. గోదాముల నుండి రేషన్ దుకాణాలకు చేర్చేసరికి బియ్యం తరుగు వచ్చి డీలర్లు నష్టపోతున్నందున,తరుగుదల క్రింద 2% బియ్యం కోటాను అదనంగా అందించాలి.
11. రేషన్ దుకాణాల యెక్క అద్దె ను ప్రభుత్వమే భరించాలి.
12 హైద్రాబాద్ నగరంలో "రేషన్ భవన్" నిర్మాణానికి 1000 చ.గ.ల స్థలం కేటాయించాలి.
13. రేషన్ డీలర్లలలో ఉన్నత విద్యావంతులైన వారికి శాఖాపరమైన పదోన్నతులను కల్పించి వారి సేవలను వినియోగించుకోవాలి.

పైన తెలిపిన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు .ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వుకే శేఖర్ రావు , జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరం ముత్తయ్య , జిల్లా కోశాధికారి బానోత్ బాలు, గౌరవ సలహాదారుడు జి హేమచందర్ , టేకులపల్లి మండల అధ్యక్షులు ఆంగోత్ సంతులాల్ , జిల్లా సహాయ కార్యదర్శి కే పద్మ ,జిల్లా ప్రచార కార్యదర్శి వెంకటేష్ , జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్ భాగ్యమ్మ , డీలర్లు పి రాణి , అనంతరాములు , ఎస్ రాణి , వెంకటేశ్వర్లు , పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## రేషన్ డీలర్ల కమిషన్ విడుదల చేయాలనీ వినతి పత్రం, అందజేత



**ఆగస్టు 25 ( సీ కే న్యూస్) చేగుంట :** చేగుంట మండల్, మండలం లోని రేషన్ డీలర్ల సమస్యలపై చేగుంట మండల్ తహసిల్దార్ శ్రీకాంత్ కు రేషన్ డీలర్ల సంఘం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలల బియ్యం ఒకేసారి పారదర్శకంగా ఉదయం 7 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పంపిణీ చేయడం జరిగింది, మరియు ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు ఐదు నెలల రేషన్ డీలర్ల కమిషన్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు. అలాగే ఐదు నెలలుగా కమిషన్ రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని అన్నారు, ప్రభుత్వం వెంటనే కమిషన్ విడుదల చేయాలని మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు చిట్టబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివాకర్, కోయల్ కార్ హరి శంకర్, నగేష్, బాలయ్య శ్రీనివాస్ ,సంతోష్ ,యాదవ రెడ్డి ,రాము తదితరులు పాల్గొన్నారు.

## సీఏ కాన్వకేషన్లో పలమనేరు విద్యార్థులు.




**పలమనేరు, ఆగస్టు 25,సీకే న్యూస్.** దేశవ్యాప్తంగా, 15 చోట్ల, జరిగిన సీఏ కాన్వకేషన్ లో, ఈరోజు, బెంగళూరు, వసంత్ నగర్, అంబేద్కర్ భవన్లో, పలమనేరుకు చెందిన, రిషబ్ మరియు శశి శ్రీనివాస్ సీఏ కాన్వకేషన్ సర్టిఫికెట్స్ మరియు మెడల్స్ పొందారు.

వీరిద్దరూ...సి ఏ మరియు సీఎంఏలో ఆరు నేషనల్ ర్యాంకులు, ఇంటర్లో స్టేట్ ర్యాంకులు, పదవ తరగతిలో ఆలిండియా ర్యాంకులు సాధించిన విషయం తెలిసిందే!

ఇద్దరూ ....మంచి కం కంపెనీలలో, మంచి ప్యాకేజీ తో, సెలెక్ట్ కావడం కూడా తెలిసిందే.రాష్ట్రపతి వద్ద ఇద్దరు అవార్డులు పొందిన విషయం కూడా తెలిసిందే.

పలమనేరు పేరును జాతీయ స్థాయిలో తీసుకెళ్లిన ఇద్దరు విద్యార్థులను శ్రేయోభిలాషులు, స్నేహితులు ప్రోత్సహించి అభినందించారు.

## రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పాశం స్వామి



**యాదాద్రి జిల్లా. సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 25** కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించినట్టు కనీస గౌరవ వేతనం 5 వేలు ఇవ్వాలని. కమిషన్ పెంచాలని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పాశం స్వామి ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యలో స్థానిక ఎమ్మార్వో దశరథ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లందరికీ గౌరవ వేతనం 5 వేలు పెంచాలని.ఏ నెల కమిషన్ ఆ నెలలోనే చెల్లించాలని. ఐదు నెలల బియ్యం కమిషన్ డబ్బులు వెంటనే చెల్లించాలని

హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో డీలర్లకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని వినత పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షులు నూనె రఘు. నరసింహాచారి వెంకటేశం స్వామి ఐలయ్య డీలర్లు తధితరులు పాల్గొన్నారు

## నిరుపేద కుటుంబానికి ఏజెర్ ఫౌండేషన్ సమక్షంలో ఆర్థిక సహాయం అందజేత.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 25.** యాదాద్రి భువనగిరి జిల్లా:-
వలిగొండ మండల్:- నాతాళ్లగూడెం గ్రామానికి చెందిన ఉండారి రామకృష్ణ , భార్య ప్రీతి గారు కొన్ని రోజుల క్రితం ఏరియా హాస్పిటల్ లో డెలివరీ అయ్యింది నాలుగు రోజులు అవుతుంది, శ్వాస ఆడక పోవడంతో ఇబ్బంది పడుతూ గాంధీ ఆసుపత్రిలో మరణించారు, వారి యొక్క కుటుంబ సభ్యులకి, (%ూజీ=% ఫౌండేషన్) ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో (5000వేల రూపాయలు ) అందజేశారు..
ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గ్రామ యువత ,%ూజీ= ుముఎ% , పాల్గొన్నారు

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో దరఖాస్తుల శ్రీకరణ



**ఆగస్టు 25 (సీ కే న్యూస్) చేగుంట:** చేగుంట మండల్ కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంగ్లీష్, నర్సింగ్ పోస్టులకు అర్హత గలవారు దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు. స్కూల్ యజమాన్యం స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి మాట్లాడుతూ పీజీ సి ఆర్ టి ఇంగ్లీష్, పి జి సి ఆర్ టి నర్సింగ్ పోస్టులకి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపినారు. పి జి సి ఆర్ టి ఇంగ్లీష్ కు అర్హతలు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బిఎడ్, టెట్ క్వాలిఫై అయినా అభ్యర్థులు అర్హులు అని, అలాగే పి జి సి ఆర్ టి నర్సింగ్ పోస్ట్ కి బీఎస్సీ నర్సింగ్ అర్హత గల వారు అని. ఈ పోస్ట్ లకు ఆసక్తి ఉన్న మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు సెల్ నెంబర్ 7660981739 కు సంప్రదించగలరు.

## గోపాలపేటలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలి..

ప్రజావాణిలో వినతి అందించిన నల్లమోతు మోహన్ రావు..




**తల్లాడ ఆగష్టు 25 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్** తల్లాడ మండల ంలోని గోపాలపేట గ్రామంలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ మాజీ సర్పంచ్, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు నల్లమోతు మోహన్ రావు, తెదేపా నాయకులు కూచిపూడి వెంకటేశ్వరావు వినతిపత్రం అందించారు. సోమవారం తల్లాడలో ప్రజావాణిలో తహశీల్దారు సురేష్ కుమార్ కు వారు వినతిని అందించారు. అదేవిధంగా ఎస్సీలకు స్మశాన వాటిక, రోడ్లు లేక అవస్థలు పడుతున్నారని, వాటిని కూడా మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేరసాని వెంకటయ్య, ఇసనపల్లి రవి, కొత్తపల్లి మహేష్ పాల్గొన్నారు.



**సి కే న్యూస్ :** నారాయణఖేల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయుడు దురుసుగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. తన్నడం, ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టడం చేస్తున్నాడని గంటసేపు గేట్ వద్ద ధర్నా చేశారు. ఇలాంటి ఘటనలు కాకుండా చూసుకుంటామని సిబ్బంది చెప్పినప్పటికీ ఆందోళన కొనసాగించారు. తక్షణమే ఉపాధ్యాయుడు కిష్టయ్యను సస్పెండ్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నేను అలాంటి మాటలు మాట్లాడలేదని ఉపాధ్యాయుడు చెప్తున్నాడు. అంతలోపే విద్యార్థులు అబద్ధపు మాటలు మాట్లాడకు అని చెప్పి డౌన్డౌన్ కిష్టయ్య సార్ అని నినాదాలు చేశారు.

## స్థానిక సమస్యలపై బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ధర్నా.

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 25.** భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షులు శ్రీ బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో.

వలిగొండ మండలం కేంద్రంలో మండలంలోని స్థానిక సమస్యల పైన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి మండలానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గూడూరు నరోత్తం రెడ్డి గారు హాజరైనారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి బిజెపి నాయకులు మాట్లాడుతూ మండల మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అనేక సమస్యలు ప్రస్తావించారు. గ్రామాలలో డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్య కార్యక్రమాలు , ఊరికి దగ్గరగా ఉన్న కాలువల వెంట కలవట్ల నిర్మాణం, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో, మరియు ఇతర గ్రామాలను కలుపుతూ ఉన్నటువంటి రోడ్లను పునర్నిర్మించాలి, మారమత్తులు చేపట్టాలి, రైతులకు అందించే ఉచిత విద్యుత్తు ఈ మధ్యకాలంలో తక్కువ సమయం అందిస్తున్నారు, ఇచ్చిన మాట ప్రకారం రైతులకు నాణ్యమైన 24 గంటల వ్యవసాయ విద్యుత్తు అందించాలి లేనియెడల భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఏఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలియజేశారు. భీమలింగం హై లెవెల్ బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభించి ముఖ్యమంత్రి ఇచ్చిన మాట, స్థానిక ఎమ్మెల్యే గారు చొరవచూపి వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బు నాది గాని కాలువ పనులను వెంటనే పూర్తి పూర్తి చేసి నీటి విడుదల చేయాలి. మండల కేంద్రంలో రైతులకు ట్రాన్స్ఫార్మర్ రిపేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. మండలంలోని వివిధ గ్రామాలలో బెల్ట్ షాపులు, గంజాయి మహమ్మారిని అరికట్టాలి. వలిగొండ మండల కేంద్రంలో ప్రభుత్వాసుపత్రిలో 24 గంటల వైద్య




సేవలు కల్పించాలి. అదేవిధంగా మండల కేంద్రంలో రెండో వార్డు, మూడో వార్డులో ప్రజలకు నీటి కొరతను తీర్చాలి ఇవే కాకుండా ఇంకా అనేక స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ తరపున డిమాండ్ అనంతరం ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో గారికి మెమోరండం అందించారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏలే చంద్రశేఖర్, బంధారపు లింగస్వామి, జిల్లా నాయకులు ఎలిమినేటి వెంకటేశం ,కందుల తానీషా, రాచకొండ కృష్ణ, మందారపు రాములు , మందుల లక్ష్మి ,మైసొల్ల రామ నర్సు, బచ్చు శ్రీనివాస్, బొడిగె ఆనంద్, రావుల పద్మారెడ్డి, మండల నాయకులు గంగాధరీ దయాకర్, మందుల నాగరాజు, లోడే లింగస్వామి, ఎదురుగట్ల వెంకటేశం, మందడి రంజిత్ రెడ్డి, కొత్త రామచంద్రం, పిన్నింటి నరేందర్ రెడ్డి, దయ్యాల వెంకటేశం, ఆవుల శీను,రేగుర్ అమరేందర్, రేగు శ్రీధర్, బుంగమట్ల మహేష్, హరికృష్ణ, పబ్బు రమేష్, చెరుకదానయ్య, కట్ట దానయ్య, కీర్తి వెంకటేశం, ఏరువ కృష్ణ, గుర్రం కుమారస్వామి, మండలోజు రాజేశ్వర చారి, నాగెల్లి సందీప్, లాలయ్య, జంగయ్య, ఎర్రవోలు జంగయ్య, గట్టు రాజు, సైదులు రెడ్డి, సురేష్, కట్ట బిక్షం వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు కార్యకర్తలు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## కె హెచ్ ఆర్ ఫౌండేషన్ తరపున మృతురాలు ఎలిమిలేటి లక్ష్మి కుటుంబానికి ఆర్థిక సాయం



**సి కె న్యూస్ ఆత్మకూర్ యం రిపోర్టర్ షేక్ అజీజ్ :** యాదాద్రి భువనగిరి :జిల్లా మండలం ఆత్మకూర్ (ఎం) ఆత్మకూరు పట్టణ కేంద్రంలో అనారోగ్యం కారణంగా ఎలిమినేటి లక్ష్మీ మరణించడం జరిగింది వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, బి ఆర్ ఎస్, పార్టీ రాష్ట్ర నాయకుడు ,కె హెచ్ ఆర్,ఫౌండేషన్ చైర్మన్ శ్రీ కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో గ్రామ శాఖ ఆధ్వర్యంలో ?5000 రూపాయలు ఆర్థిక సాయం వారి కుమారునికి ఎలిమినేటి నరసింహ కు అందించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ మరియు ఆత్మకూర్ తాజా మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రారెడ్డి మరియు కోర వెంకన్న గడ్డం దశరథ గౌడ్ సోలిపురం అరుణ ఉపేందర్ రెడ్డి నాయకులు నాతి రాజు కొండపల్లి అబ్బ సాయిలు మజ్జిగ రాంబాబు బూడిది వెంకటేష్ గౌడ్ మాది సత్తయ్య గౌడ్ ఎలిమినేటి నాగేష్ ఎలిమినేటి మురళి కృష్ణ ఎలిమినేట్ కిరణ్ మహేష్ పంజాల రాజు లోడి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

# మట్టి వినాయకులతోనే పూజలు చేద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం

సింగరేణీయులకు డైరెక్టర్ పా గౌతమ్ పొట్రు విజ్ఞప్తి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 25,** వినాయక చవితి సందర్భంగా సింగరేణి కార్మికులు, అధికారులు మట్టి వినాయక ప్రతిమలతో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని, తద్వారా తమ వంతుగా పర్యావరణకు దోహదపడాలని సింగరేణి డైరెక్టర్ పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ గౌతమ్ పొట్రు పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో సోమవారం ఆయన మట్టి వినాయక ప్రతిమలను ఉద్యోగులకు, అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణహిత మైనింగ్ కు మారుపేరుగా నిలుస్తున్న సింగరేణి సంస్థ, పర్యావరణహితంగా వినాయక చవితి పండుగను తమ ఉద్యోగులు నిర్వహించుకోవాలన్న ఉద్దేశంతో గత కొన్ని సంవత్సరాలుగా మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తుందని, కనుక ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఈ మట్టి ప్రతిమలతో వినాయక చవితిని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారుచేసిన వినాయక ప్రతిమలు నిమజ్జనం అనంతరం చెరువుల్లో, జలాశయాలలో జల కాలుష్యానికి కారణం అవుతున్నాయని, దీనిని నివారించాలంటే మట్టి విగ్రహాలతో వినాయకుని పూజా కార్యక్రమాలు జరుపుకోవడం ఎంతో శ్రేయస్కరమని, తద్వారా మన పూర్వీకుల సాంప్రదాయాన్ని తిరిగి కొనసాగించిన వారమవుతామని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జీఎం మార్కెటింగ్ టి.శ్రీనివాస్, సింగరేణి భవన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కోళ్ల గూట్లో తాచు పాము బుసలు

- సమయస్ఫూర్తితో చాకచక్యంగా పట్టుకున్న సంతోష్
- ఇరుకు ప్రదేశాలే పాములకు నిలయాలు



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్ట్ 25,**కార్పొరేషన్ లోని న్యూ గొల్లగూడెంలో ఓ ఇంట్లో సోమవారం సాయంత్రం కోళ్ల గూట్లోకి తాచుపాము చేరి కలకలం సృష్టించింది. కోళ్లు కేకలు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఓ పాము కోళ్ల గూట్లోకి దూరడం చూసి భయంతో వెంటనే ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ కు సమాచారం ఇచ్చారు. వెంటనే వారిని అప్రమత్తం చేసిన సంతోష్ అక్కడకు చేరుకుని చాకచక్యంగా గూట్లో దూరిన ఐదు అడుగుల తాచు పామును పట్టి బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా ఇరుకు ప్రదేశాలు, రాళ్ల కుప్పలు, నిరుపయోగ సామానులే సర్పాలకు ఆవాసాలు కాబట్టి ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం మంచిది అలాగే ఏజెన్సీ ప్రాంతం కాబట్టి సర్పాల పట్ల అవగాహన కలిగి ఉండడం అవసరమని వివరించారు.

# బీసీల ఆరాధ్యుడు బిపి మండల్



**హనుమకొండ జిల్లా సి కే న్యూస్**


బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో

బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో మండల్ జయంతి కార్యక్రమాన్ని సోమవారం రోజున నిర్వహించారు మొదట బీపీ మండల్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు


బిందేశ్వర్ ప్రసాద్ మండల్ గారి కమిషన్ సిఫార్సు ప్రకారం విద్య, ఉద్యోగాల్లో ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ లభించాయని అన్నారు ఓబీసీల కోసం అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు అని కొనియాడారు బిపి మండల్ జయంతి సందర్భంగానైనా రాజ్యాంగపరంగా రావాల్సిన బీసీ ల హక్కుల కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు బుద్దె వెంకన్న, మూటిక రాజు యాదవ్, అభిలాష్, కోటి, రాజ్ కుమార్, రాజు, మనోజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

# వైజాగ్ లో తిరుమలాయపాలెం యువతి బలవన్మరణంతో ఎర్రగడ్డలో విషాదం

## అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేసిన ఎస్ఐ కూచిపూడి జగదీష్







**సీ కె న్యూస్ ప్రతినిధి కొలిశెట్టి వేణు, తిరుమలాయపాలెం..** ప్రేమించి పెళ్లాడని యువకుడు నమ్మించి మోసగించాడని ఓ యువతి బలవన్మరణానికి పాల్పడిన ఘటనతో తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి . పోలీసులు తెలిపిన కథనం ప్రకారం తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామానికి చెందిన మేడ నరేష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన కొర్లపూడి రమ్య ప్రేమించుకున్నారు కులాలు వేరువేరు కావటం ఆమెకు పెళ్లి వయసు రాకపోవడంతో పెద్దలు వారి పెళ్లికి నిరాకరించారు తదనంతరం నరేష్ కి వేరే అమ్మాయితో వివాహం అయింది. రమ్య హైదరాబాదులో ప్రవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వివాహనంతరం నరేష్ సైతం హైదరాబాద్ లోనే ఓ మెడికల్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు.

ఇటీవల రాఖీ పండుగ సందర్భంగా నరేష్, రమ్య వేరువేరుగా ఎర్రగడ్డకు వచ్చారు. ఒకరికొకరు చూసుకోవటం మాట్లాడుకోవడంతో వారి మధ్య మళ్ళీ ప్రేమ చిగురించింది. వారిద్దరు ఫోన్లో సంభాషిస్తూ విజయవాడకు రమ్యను తీసుకెళ్లి నరేష్ పెళ్లి చేసుకున్నాడు. అక్కడి నుంచి వారిద్దరూ వైజాగ్ వెళ్లి ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నారు. నరేష్ కనిపించడం లేదని అతని తండ్రి బొందయ్య ఫిర్యాదు మేరకు తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్లో ఈనెల 13న కేసు నమోదు చేశారు ఈ విషయం తెలుసుకున్న నరేష్ మొబైల్ తీసుకుని హైదరాబాద్ వెళ్లాడు.రమ్య ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో మోసపోయానని గ్రహించి తానున్న గదిలో ఈ నెల 24న రమ్య ఉరితీసుకొని చనిపోయారు. అనంతరం ఆమె తల్లిదండ్రులకు ఓ లేఖ రాస్తూ... నాన్న మీరు చెప్పిన మాట వినలేదు నరేష్ మోసగించాడు.. క్షమించండి..అమ్మ నాన్న అని ఆమె రాసిన లేక లభ్యమైంది. వైజాగ్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో నరేష్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. రమ్య మృతదేహాని తిరుమలాయపాలెం పోలీసులు ఎర్రగడ్డ గ్రామానికి సోమవారం తీసుకొచ్చారు.. రమ్య అంత్యక్రియలు నేపథ్యంలో ఎర్రగడ్డ గ్రామంలో అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్సై కూచిపూడి జగదీష్ తన సిబ్బందితో పాటు నియోజకవర్గ పోలీస్ స్టేషన్ల పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించారు. నరేష్ నీ వైజాగ్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

# ప్రీ ప్రైమరీ పాఠశాలలో పిల్లలను చేర్పించండి...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),ఆగస్టు 25,**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రీ ప్రైమరీ పాఠశాలలలో పిల్లలను చేర్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. జిల్లాలోని 21 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీకి తరగతుల ప్రారంభించ డానికి ప్రభుత్వము నుండి అనుమతి వచ్చిన సందర్భంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో మాట్లాడుతూ ఈ 21 పాఠశాలల పరిధిలోని నాలుగు సంవత్సరాలు నిండిన బాల బాలికలను ప్రీ ప్రైమరీ తరగతులలో జరిపించడానికి మండల విద్యాశాఖ అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఈ పిల్లలకు కావలసిన యూనిఫామ్, పుస్తకాలు, క్రీడా పరికరాలు, అందించనున్నామని, పాఠశాలను రంగులతో ఆకర్షణీయంగా తయారు చేసి పిల్లలను ఆకర్షించాలని అన్నారు. ఈ పిల్లలకు మధ్యాహ్న భోజనం అదేవిధంగా అల్పాహారం కూడా అందించనున్నామని కలెక్టర్ తెలిపారు. పిల్లలందరికీ ఆరోగ్య పరీక్షలు చేసి వారికి కావలసిన వైద్య సహాయం కూడా అందించడానికి ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. పిల్లలకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో మండల విద్యాశాఖ అధికారులు ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని, ప్రతి పాఠశాలలో కనీసం 20 మంది పిల్లలు ఉండేటట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 1వ తేదీ నాటికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేసి పిల్లలను ఒక పండగ వాతావరణం లో పాఠశాలల్లో చేర్పించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలతా లేనినా, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్‌లో సిద్ధమైన మహా గణపతి

**ఖైరతాబాద్ లో సిద్ధమైన 69 అడుగుల శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి**

**నేత్రావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రముఖ శిల్పి రాజేందర్**

**భక్తుల సందడి మధ్య బడా గణేశ్ ఆగమన్**




ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ వినాయక మండపాల్లో ఖైరతాబాద్ (హైదరాబాద్) గణేశ్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ప్రతీ ఏటా భారీ విగ్రహం, విశేష అలంకరణలతో జరిగే ఈ ఉత్సవాలకు లక్షలాది భక్తులు తరలివస్తారు. ఈ సంవత్సరం కూడా 69 అడుగుల శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి రూపంలో ఖైరతాబాద్ గణేశ్ సిద్ధమయ్యారు.గణేశ్ విగ్రహ నిర్మాణంలో చివరి దశ అయిన నేత్రావిష్కరణ కార్యక్రమాన్ని నిన్న ఘనంగా నిర్వహించారు. ప్రముఖ శిల్పి రాజేందర్ గణపతికి నేత్రాలు గీశారు. మూర్తికి "ప్రాణ ప్రతిష్ఠ"కు ముందు జరిగే ఈ నేత్రావిష్కరణను విశేషంగా పరిగణిస్తారు.

**బడా గణేశ్ ఆగమన్ - భక్తుల సందడి**

నేత్రావిష్కరణ అనంతరం 'బడా గణేశ్ ఆగమన్' కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. డీజే బీట్స్, మరాఠీ బ్యాండ్, సంప్రదాయ తాళాలు, డోలు వాయిద్యాలతో గణపతికి స్వాగతం పలికారు. నగర యువత జోలిపాలు తొడగట్టుకొని నృత్యాలతో పాల్గొంటూ ఉత్సాహాన్ని పంచారు. వీధులన్నీ భక్తుల కోలాహలంతో మారుమోగాయి.

# సెప్టెంబర్ 6వ తేదీన గూడెంలో గణేష్ నిమజ్జనం ఉత్సవం.

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఉత్సవ కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 25,**ప్రతి ఏడాది నిర్వహించే వినాయక ఉత్సవాలు ఈనెల 27వ తేదీన ప్రారంభమై వచ్చేనెల 6వ తేదీన నిమజ్జన ఉత్సవంతో ముగుస్తాయని గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు తెలిపారు. సోమవారం పట్టణంలోని భజన మందిరం సమీపంలో ఉన్న వివేకానంద హై స్కూల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ తరువాత ఆ స్థాయిలో ఒక్క కొత్తగూడెంలో మాత్రమే గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారని, 50 ఏళ్లుగా అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరుగుతున్నాయని ఈ ఏడాది కూడా ఆ స్థాయిలోనే నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించిందని వివరించారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడం హర్షించదగిన పరిణామంగా అభివర్ణించారు. అదేవిధంగా పోలీస్ శాఖ కూడా మానవతాదృక్పథంతో వ్యవహరించి మైక్ పెర్మిషన్ కు సంబంధించిన రూ 1500 అనుమతులను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని, విచ్చలవిడిగా కనెక్షన్లు ఇవ్వకుండా మండపాల నిర్వహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు, స్థానికులకు, వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మండపాలు నిర్మించుకోవాలని, విజ్ఞప్తి చేశారు. గణేష్ నిమజ్జనం రోజున విగ్రహాలతో క్రమశిక్షణగా ప్రకాశం స్టేడియం కు సాయంత్రం 4 గం.లకు చేరుకొని అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రగా సూపర్ బజార్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్దకు చేరుకోవాలని చెప్పారు. పోలీస్ శాఖ సూచనలు పాటిస్తూ మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ యువత భక్తి భావంతో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఈ కార్యక్రమంలో పేర్కొన్నారు. గణేష్ మండపాలకు బ్యానర్లు, జెండాలు, పూజా ద్రవ్యాలు ఉచితంగా పంపిణీ చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు కొదమ సింహం పాండురంగాచార్యులు, పలివేల సాంబశివరావు, విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ ప్రధాన కార్యదర్శి గడదేశి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి దారా రమేష్, ఉపాధ్యక్షులు మెరుగు చింటేశ్వరరావు, కోశాధికారి వందనపు శ్రీధర్, ప్రచార కార్యదర్శి గుమలాపురం సత్యనారాయణ, కొల్లు పద్మ, సాగర్, సందీప్, పులిగంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పూజ కోసం పూజారికి రూ.10 పంపి రూ 5.99 లక్షలు దోచేశారు!



చేసింది రేపు చేయకపోవటం. సీజన్ కు తగ్గట్లు.. ట్రెండ్ కు సూట్ అయ్యే కాన్సెప్టులతో మోసం చేసే విషయంలో సైబర్ నేరగాళ్ల తర్వాతే ఎవరైనా. ఎప్పటికప్పుడు కొత్త తరహాలో మోసం చేసే వారు.. తాజాగా హైదరాబాద్ లోని ఒక పూజారిని 'పూజ' పేరుతో దారుణంగా మోసం చేసిన వైనం వింటే షాక్ కు గురి కావాల్సిందే. హైదరాబాద్ లోని పాతబస్తీకి చెందిన పురానాపూల్ పూజారిని సైబర్ నేరస్తులు ఎలా ట్రాప్ చేశారన్నది చూస్తే..

సికింద్రాబాద్ మిలిటరీ ఆఫీసు నుంచి తాము ఫోన్ చేస్తున్నట్లుగా పూజారికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశారు. కల్నల్ సారు ఆరోగ్యం బాగోలేదని.. ఆయన కోసం పూజలు చేయాలని కోరారు. మొత్తం 11 రోజుల పూజ కోసం 21 మంది పురోహితుల అవసరం ఉందని పేర్కొన్నారు. పూజల కోసం అడ్వాన్స్ కింద రూ.3 లక్షలు చెల్లిస్తామని ఎర వేశారు వీరి ట్రాప్ గురించి తెలియని పురోహితుడు.. వారి మాటల్ని పూర్తిగా నమ్మేశారుఅడ్వాన్సుగా రూ.10 పంపిన సైబర్ నేరగాళ్లు.. వీడియో కాల్ చేసి మిగిలిన డబ్బులు పంపుతామని నమ్మించారు. కార్డు.. పిన్ వివరాల్ని సేకరించి.. పురోహితుడు పంపిన సమాచారంతో ఆయన అకౌంట్ నుంచి విడతల వారీగా రూ.5.99 లక్షలు దోచేశారు. తాను దారుణంగా మోసపోయిన వైనాన్ని గుర్తించి వెంటనే 1930కి కాల్ చేసి సమాచారాన్ని ఇచ్చారు. అనంతరం హైదరాబాద్ సీసీఎస్ కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఏ చిన్న అవకాశం లభించినా దోచేందుకు సిద్ధంగా ఉన్న సైబర్ నేరగాళ్ల విషయంలో అందరూ మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం తాజా ఉదంతం చెప్పకనే చెప్పేస్తుందని చెప్పాలి.

## 'సేనతో సేనాని'.. మార్పుకోరుతున్న సేనలు.. !




'సేనతో సేనాని' పేరుతో జనసేన ఈనెల 28వ తారీకు నుంచి విశాఖపట్నంలో మూడు రోజులు పాటు విస్తృత స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసింది. ఈ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్చించనున్నారు. ముఖ్యంగా రెండు కీలక అజెండాలను పెట్టుకొని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బలంగా నిర్ణయించుకున్నారు.

అయితే ఈ అజండాతో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు కొంత మార్పును కోరుకుంటున్నారు. దానిపై కూడా చర్చించాలనేది వారు కోరుతున్న డిమాండ్. ప్రధానంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా లేకపోవడం, గ్రామీణ స్థాయిలో పనులు చేస్తున్నప్పటికీ తమకు గుర్తింపు రావడం లేదు అనేది జనసేనలో కొన్నాళ్లుగా వినిపిస్తున్న మాట. ప్రధానంగా డామినేషన్ రాజకీయాలు జరుగుతున్నాయి అన్నది జనసేన నేతలు చెబుతున్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్న నియోజకవర్గంలో కూడా డామినేట్ చేస్తున్నారని, ప్రచారం నుంచి పనుల వరకు అన్ని వారే చేయించుకుంటున్నారనేది జనసేనలో అంతర్గతంగా సాగుతున్న చర్చ.

ఇదే సమయంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సైలెంట్ గా ఉండడం, కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడంలోనూ అధికారంలోకి తీసుకురావడంలను కీలక పాత్ర పోషించిన జనసేనకు దక్కాల్సిన విధంగా గౌరవం దక్కడం లేదన్నది వారి ఆవేదన. కానీ, పవన్ కళ్యాణ్ మాత్రం మనకు రావలసిన దానికన్నా ఎక్కువగానే గౌరవం లభిస్తోందని అంతర్గతంగా చెబుతున్నారు. ఈ రెండు అంశాల మధ్య నాయకులు తల్లడిల్లుతున్నారు. అయితే, దీనిని సున్నితంగా తీసుకోవాలని, ప్రతి విషయంలోనూ పట్టుదలతో వ్యవహరిస్తే సరికాదు అన్నది జనసేన అధినేత చెబుతున్న మాట.

కానీ, క్షేత్రస్థాయిలో నాయకులు మాత్రం దీనిపైన చర్చించి ఒక నిర్ణయానికి రావాలని కోరుతున్నారు. సామాజిక వర్గాల వారీగా పార్టీని బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత దూకుడుగా వ్యవహరించేలా నిర్ణయాలు తీసుకోవాలన్నది కార్యకర్తలు సూచిస్తున్న మాట. దీనికి ఏ మేరకు ఈ వేదిక ఉపయోగపడుతుంది భవిష్యత్తు నిర్ణయాలకు ఏ మేరకు దోహదపడుతుందని చూడాలి. ఎన్నికల నాటికి పార్టీని సంస్థగతంగా బలోపేతం చేసుకుంటే సొంతంగానే అధికారంలోకి రావాలన్నది కొందరు చెబుతున్న మాట. కానీ. కూటమితోనే 15 సంవత్సరాల పాటు ఉంటామని జనసేన అధినేత చెబుతున్న నేపథ్యంలో ఈ సమావేశాలకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సమస్యలకు పరిష్కారం చూపిస్తుందా లేక ఈ వేదిక కేవలం పొగడ్తలకు పరామర్శలకు మాత్రమే పరిమితం అవుతుందా అనేది చూడాలి. మరో కీలక అంశం... వివాదాస్పదమవుతున్న ఎమ్మెల్యేల తీరును ఈ వేదిక ద్వారా సరిచేయాలనేది కూడా నాయకుల నుంచి వినిపిస్తున్న మాట. ఒకరిద్దరు నాయకుల కారణంగా జనసేన పార్టీ ఇటీవల కాలంలో ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే.

# 30 రోజుల్లో జైలు బిల్లు...జేపీసీ కి విపక్షం బాయ్ కాట్!



తీవ్ర నేరారోపణలు మీద అరెస్ట్ అయి వరుసగా ముప్పయి రోజుల పాటు జైలు జీవితం అనుభవించిన వారికి 31వ రోజున పదవి ఆటోమేటిక్ గా పోతుంది. అది పధాని ముఖ్యమంత్రి మంత్రులు ఎవరు అయినా సరే ఇది వర్తిస్తుంది. ఈ బిల్లుని లోక్ సభలో కేంద్ర హెూం మంత్రి తాజాగా ప్రవేశపెట్టారు. అయితే విపక్ష సభ్యుల అభ్యంతరాల మధ్య దానిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ జేపీసీకి పంపిస్తున్నట్లుగా ప్రకటించారు. లోక్ సభ రాజ్యసభ సభ్యులు మొత్తం 31 మందితో కలుపుకుని జేపీసీని ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఇందులో అధికార బీజేపీ ఇతర ఎన్డీయే మిత్ర పక్షాలతో పాటు విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు కూడా ఉంటారు అని ప్రభుత్వం అంటోంది. అంతా కలసి ఈ బిల్లుని సమగ్రంగా పరిశీలించి తగిన సిఫార్సులు చేస్తే తుది బిల్లుని పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టాలన్నది కేంద్ర ప్రభుత్వం ఆలోచన.

**ఆదిలోనే గండి :**

అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకుని రావాలనుకుంటున్నా ఈ బిల్లు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉంది. దాంతో ఈ బిల్లు మీద కేంద్ర హెూం మంత్రి అనేక జాతీయ చానళ్ళతో మాట్లాడుతూ ఈ బిల్లు చాలా అవసరం అన్నారు. జైలు నుంచి పాలించాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదని ఆయన చెప్పుకొచ్చారు అందువల్లనే ఈ బిల్లుని తెస్తున్నామని సమర్థించుకున్నారు. అయితే ఈ బిల్లుకు ఆదిలోనే విపక్షాలు గండి కొడుతున్నాయి. ఆ విధంగా ఎన్డీయే ప్రభుత్వానికి భారీ షాక్ ఇస్తున్నాయి.

**కాంగ్రెస్ సహా కీలక పార్టీలు నో :**

జేపీసీని బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ సహా ఇతర ఇండియా బ్లాక్ లోని పార్టీలు తాజాగా ప్రకటించడం విశేషం. పార్లమెంట్ జేపీసీలో తమ పార్టీల నుంచి ఎంపీలను ప్రతిపాదించమని సమాజ్‌వాదీ పార్టీ తృణమూల్ కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించాయని అంటున్నారు. ఇప్పుడు ఆ జాబితాలోనికి ఆమ్ ఆద్మీ పార్టీ శివసేన యూబీటీ కూడా చేరాయి. తాము జాయింట్ పార్లమెంటరీ కమిటీని బహిష్కరిస్తున్నట్లుగా ఈ పార్టీలు అన్నీ ప్రకటించాయి. అదే విధంగా కాంగ్రెస్ తన పార్టీ ఎంపీలను పంపడానికి ఏ మాత్రం ఇష్టపడటం లేదని ఆ పార్టీ ప్రకటించింది. ఇక ఈ బిల్లుని లోక్ సభలో ప్రవేశపెట్టిన సమయంలోనే , ప్రతిపక్ష నాయకులు దీనిని నిరసనగా వాకౌట్ చేశాయి.

**ప్రజాస్వామ్యం అణచివేత కోసం :**

ఈ బిల్లు కనుక చట్టం అయితే ప్రజాస్వామ్యం గొంతుని అణచివేస్తుందని శివసేన యూబీటీ స్పష్టంగా పేర్కొంటోంది. ఇక తాజాగా జరిగిన వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఈ వివాదాస్పదమైన బిల్లుని తెచ్చిందని అంటోంది. ఈ బిల్లును సమీక్షించడానికి ఏర్పాటు చేసిన జేపీసీ అన్నది కేవలం ఒక లాంచనం మాత్రమే అని ఆయన ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. అందుకే ఈ జేపీసీలో శివసేన యుబిటి పాల్గొనదని ఆయన స్పష్టం చేశారు.

**జేపీసీ ఏర్పాటు అవుతుందా :**

నిజానికి అనేక బిల్లుల విషయంలో విస్తృత అభిప్రాయం కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ జేపీసీని వేయడం అన్నది చాలా కాలంగా జరుగుతూనే ఉంది. అలా గతంలో వక్ఫ్ చట్టం సవరణ బిల్లుని కూడా జేపీసీకి పంపించి ఆ మీదట పార్లమెంట్ లో చర్చకు పెట్టారు. ఈ బిల్లు కూడా అన్ని పార్టీల చర్చకు వస్తే తుది రూపంతో పార్లమెంట్ లో పెట్టాలని ఎన్డీఏ సర్కార్ ఆలోచిస్తోంది. కానీ 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందితే కేవలం నెలరోజులపాటు అరెస్టయినా ఐదు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష విధించిన ఆరోపణలపై నిర్బంధించినా పదవులు పోతాయని విపక్షాలు అంటున్నాయి. పైగా విపక్షాలకే ఈ బిల్లు చట్టం అయితే ఎక్కువగా ప్రయోగించే ప్రమాదం ఉందని కూడా అంటున్నాయి. మరి ప్రధాన పక్షాలు లేని జేపీసీ ఏర్పాటు అవుతుందా లేదా అన్నది చూడాల్సి ఉంది

# నిర్ణయం మార్చుకున్న జగన్.. సర్కారుతో అమీతుమీ తేల్చుకోవడమేనట..!



వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ జనం బాట పట్టనున్నారు. వచ్చే నెలలో రాజమండ్రి లేదా కర్నూలులో వైసీపీ తరఫున నిర్వహించే ధర్నాకు జగన్ హాజరుకానున్నారు. అదేవిధంగా దసరా తర్వాత జిల్లాల పర్యటనకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రతి నెలా ఏదో ఒక కార్యక్రమం పేరిట జనంలోకి వస్తున్న జగన్.. పార్టీ పరమైన కార్యక్రమాలను అడపాదడపా మాత్రమే నిర్వహిస్తున్నారు. తాడేపల్లిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలోనే కార్యకర్తలు, నాయకులతో సమావేశమవుతున్నారు. అయితే ఇకపై క్షేత్రస్థాయిలోనూ పార్టీకి ఊపు తేవాలన్న ఆలోచనతో జిల్లాల పర్యటనకు రూట్ మ్యాప్ తయారు చేయాలని పార్టీ వర్గాలను అధినేత ఆదేశించినట్లు సమాచారం.

**రైతు సమస్యలపై పోరుబాట**

గుంటూరు మిర్చియార్డు, పొదిలిలో పొగాకు రైతులు, బంగారుపాళ్యంలో మామిడి రైతులు ఇలా ఒక్కో అంశాన్ని హైలెట్ చేస్తూ ఇన్నాళ్లు జగన్ పర్యటనలు సాగేవి. ఇదే సమయంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫీజు పోరు, కరెంటు చార్జీలు, వ్యవసాయ సమస్యలపై పోరాటం వంటి కార్యక్రమాలకు జగన్ హాజరుకాలేదు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల నిర్వహణ సమయంలో ఆయన రాష్ట్రంలో ఉన్నా కూడా కేడర్ అంతా పాల్గొనేలా దిశానిర్దేశం చేశారే తప్ప, అధినేతగా జగన్ ఎక్కడా పాల్గొనలేదు. దీనికి కారణం కూటమి ప్రభుత్వానికి ఏడాది వరకు సమయం ఇవ్వాలనే. అదేసమయంలో అత్యావసర సమయాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మిర్చి, పొగాకు, మామిడి రైతుల సమస్యలపై జగన్ నేరుగా పోరాడారని చెబుతున్నారు.

**జిల్లాల పర్యటనలకు ప్రణాళిక**

ఇక ప్రభుత్వం ఏర్పడి 15 నెలల అవడం, జమిలి ఎన్నికలు జరిగితే ఏడాది ముందుగానే ఎన్నికలను ఎదుర్కోవాల్సి రావొచ్చనే అంచనాతో కార్యక్షేత్రంలోకి దిగాలని వైసీపీ అధినేత జగన్ తాజాగా నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు పాదయాత్ర చేస్తానని ఇప్పటికే ప్రకటించిన జగన్.. ఈ లోగా జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నేరుగా పోరాడాలని నిర్ణయించుకున్నట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి నెలా రెండు రోజుల పాటు జిల్లాల్లో గడపాలని భావిస్తున్న జగన్, ఆ రెండు రోజులు పూర్తిగా జిల్లాలో పార్టీ పరిస్థితి, కేడర్ సమస్యలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఫోకస్ చేస్తారని తెలుస్తోంది.

**ఇక ధర్నాల్లో జగన్**

ఇదే సమయంలో సర్కారుపై ఒత్తిడి పెంచేందుకు తాను కూడా ఇక నుంచి ధర్నా కార్యక్రమాల్లో పాల్గొనాలని జగన్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం వచ్చేనెలలో దివ్యాంగ పింఛన్ల తొలగింపుపై భారీ నిరసన కార్యక్రమం నిర్వహించాలని జగన్ ఆలోచనగా చెబుతున్నారు. ప్రస్తుతం దివ్యాంగుల పింఛన్ల పరిశీలనకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. పింఛన్ల వడబోతకే సర్కారు ఈ విధంగా చేస్తోందని, అనర్హుల పేరిట తమ పింఛన్లను తొలగిస్తారనే భయంతో చాలా చోట్ల దివ్యాంగులు ఆందోళనలు చేస్తున్నారు. అయితే ఈ కార్యక్రమాలకు వైసీపీ పరోక్షంగా సహకరిస్తున్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. అయితే తాజాగా వైసీపీయే ధర్నా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించడంతో సమస్య రాజకీయంగా చర్చకు దారితీస్తోంది.

**పింఛన్ల కోతపై సీరియస్**

వచ్చేనెల నుంచి పింఛన్ల కోతపై ఆందోళనకు పిలుపునివ్వాలని భావిస్తున్న వైసీపీ.. రాజమండ్రి లేదా కర్నూలులో నిర్వహించనున్న ధర్నాలో అధినేత హాజరయ్యేలా వ్యూహం రచిస్తోందని చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో వైసీపీకి బలమైన పట్టు ఉండగా, గత ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమైంది. రాయలసీమకు ముఖద్వారంగా చెప్పే కర్నూలులో మళ్లీ పుంజుకుంటే ఆటోమెటిక్ గా రాయలసీమపై ఆ ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. దీంతో జగన్ పాల్గొనే తొలి పోరు కార్యక్రమానికి రాయలసీమ వేదికైతే బాగుంటుందని చర్చిస్తున్నారు. ఇదే సమయంలో కోస్తాలో ఇంతవరకు వైసీపీ అధినేత పర్యటన లేకపోవడం, గత ఎన్నికల్లో ఆ ప్రాంతంలో పూర్తిగా చతికిలా పడటంతో కేడర్ లో ఊపు తేడానికి రాజమండ్రి అయితే బాగుంటుందనే సూచనలు వస్తున్నాయి. దీంతో ఈ రెండు చోట్ల ఎక్కడ పాల్గొనాలనేది అధినేత నిర్ణయానికి వదిలేయాలని నేతలు భావిస్తున్నారు. ఏదిఏమైనా ధర్నాలకు ఇన్నాళ్లు దూరంగా ఉన్న జగన్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం ఆసక్తి రేపుతోంది.

# భారత్ - అమెరికా మధ్య ట్రంప్ మరో చిచ్చు..!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయం భారత-అమెరికా దౌత్య వర్గాల్లో మరోసారి చర్చకు దారితీసింది. భారత వ్యవహారాలపై ఎలాంటి అనుభవం లేని, అలాగే దక్షిణాసియా దౌత్యంలో నైపుణ్యం లేని సెర్జియో గోర్ ను భారత్‌కు రాయబారిగా నియమించాలన్న ట్రంప్ ఆలోచన వివాదాస్పదంగా మారింది. అంతేకాకుండా, దక్షిణ, మధ్య ఆసియాలకు ప్రత్యేక పర్యవేక్షకుడిగా కూడా ఇతనిని నియమించడం భారత్ ప్రాధాన్యతను తగ్గించడమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**గోర్ నియామకంపై అభ్యంతరాలు**

కేవలం 38 ఏళ్ళ వయసున్న సెర్జియో గోర్‌కు దౌత్యపరమైన అనుభవం లేదు. అతను ప్రధానంగా ట్రంప్‌కు వ్యక్తిగత సలహాదారుగా, రాజకీయ వ్యూహకర్తగా పనిచేశారు. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, గోర్‌కు ఉన్న అర్హత ట్రంప్‌తో అతనికి ఉన్న వ్యక్తిగత సంబంధం మాత్రమే. మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ అభిప్రాయం ప్రకారం, భారత్‌లో రాయబారిగా ఉన్న వ్యక్తిని పాకిస్థాన్‌తో కలిపి దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం భారత్ ప్రాధాన్యతను తగ్గిస్తుంది. న్యూఢిల్లీ గతంలో ఇలాంటి ప్రయత్నాలను గట్టిగా వ్యతిరేకించింది.



**గతం పునరావృతమా?**

2009లో అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా పాలనలో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. ఆ సమయంలో రిచర్డ్ హెూల్‌బ్రూక్‌ను భారత-పాక్-ఆఫ్ఘాన్ ప్రాంతానికి ప్రత్యేక రాయబారిగా నియమించాలని ప్రయత్నించారు. అయితే, భారత్ అభ్యంతరాల కారణంగా ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, హెూల్‌బ్రూక్ పదవిని కేవలం పాక్, ఆఫ్ఘాన్‌లకే పరిమితం చేశారు. ఇప్పుడు ట్రంప్ మళ్లీ అదే చరిత్రను పునరావృతం చేస్తున్నారని దౌత్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మున్ముందు సవాళ్లు**

సెర్జియో గోర్ నియామకం అమెరికా సెనేట్ ఆమోదం పొందాలి. ఇది ఒక పెద్ద సవాల్‌గా మారవచ్చు. గతంలో బైడెన్ ప్రభుత్వం నియమించిన ఎరిక్ గార్సెట్టీ ఆమోదం పొందడానికే ఎక్కువ సమయం పట్టింది. గోర్ విషయంలోనూ ఇదే పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉంది. సెర్జియో గోర్ నియామకం ద్వారా ట్రంప్ వ్యక్తిగత నమ్మకాల ఆధారంగా దౌత్య వ్యవస్థను మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది భారత్-అమెరికా సంబంధాలను బలోపేతం చేస్తుందా లేక మరింత సంక్లిష్టంగా మారుస్తుందా అనేది చూడాలి. భారత్ ఈ పరిణామాలను జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# "లోకల్" వార్

తెలంగాణ కాంగ్రెస్ కు స్థానిక సంస్థల ఎన్నికలు సవాల్ గా మారాయి. నిజానికి ఇరవై నెలల కాంగ్రెస్ పాలనకు ఈ ఎన్నికలు ఒక రెఫరెండంగా చూడాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వస్తుంది. అయితే అవి ఏ మేరకు ప్రజల్లో సంతృప్తి నిచ్చాయన్నది ఈ ఎన్నికల్లో తేలనుంది. ఎందుకంటే గ్రామ స్థాయిలోనూ, పట్టణ, నగర స్థాయిలో జరిగే ఎన్నికలు కావడంతో పాటు పార్టీ గుర్తు ఉన్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు కూడా జరగనుండటంతో ఇది ఖచ్చితంగా కాంగ్రెస్ ఇరవై నెలల పరిపాలనకు రెఫరెండంగానే భావించాలి. ఎవరు అవునన్నా... కాదన్నా రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ఈ ఎన్నికలు ప్రజల మూడ్ ను తెలియజేయనున్నాయి.

**రైతుల్లోనూ అసంతృప్తి..**

అందులోనూ ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పరిస్థితులు అనుకూలంగా లేవు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జాము నుంచి క్యూ లైన్ లో నించుని యూరియా బస్తాల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా యూరియా కొరత త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తుంది. మరొకవైపు పాలన విషయంలోనూ ప్రజల్లో కొంత అసంతృప్తి ఉందన్నది వాస్తవం. కాంగ్రెస్ ప్రభుత్వం కావడంతో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఢిల్లీవైపు చూడాల్సి వస్తుంది. అందుకే రేవంత్ రెడ్డి స్వేచ్ఛగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలను కూడా అర్హులైన వారందరికీ అందచేయడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని సొంత పార్టీ నేతలే బయటపెడుతున్నారు. రైతు భరోసా వంటి పథకాలు చేపట్టినా దానిపై యూరియా వచ్చి ఇబ్బందిపెట్టినట్లయింది.

**పట్టణ ప్రాంతంలో...**

ఇది ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి అననుకూల మైన కాలమేనని చెప్పాలి. పల్లె ప్రాంతాల్లో ఇలా ఉంటే హైదరాబాద్ వంటి నగరాల్లో హైడ్రా కూల్చి వేతలు రేవంత్ సర్కార్ పై కొంత మంది ప్రజల్లో అసంతృప్తి ఉంది. అదే సమయంలో మూసీ అభివృద్ధి పథకం కూడా హైదరాబాద్ దాని చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల ఎఫెక్ట్ ఎక్కువగా ఉండే అవకాశముంది. ఇక బీసీ రిజర్వేషన్లను చట్టపరంగా అమలు చేయకుండా పార్టీ పరంగా చేసి ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుంది. కానీ బీసీలు ఎంత మేరకు కాంగ్రెస్ కు అండగా నిలబడతారన్నది మాత్రం సందేహమే. ఇక అనేక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతల మధ్య వైరుధ్యాలు, గ్రూపులు కూడా ఈ ఎన్నికల ఫలితాలపై ప్రతిబింబించే అవకాశముంది. అందుకే రేవంత్ రెడ్డికి మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలు అంత సులువు కాదన్నది వాస్తవం. మరి గెలిచి పరువు నిలబెట్టుకుంటారా? ఓడి తమ పనితీరును ఇది అని చెప్పదలచుకున్నారా? అన్నది త్వరలోనే తెలియనుంది.

# బాల్యానికీ హార్మోన్ల సంకటం





పిల్లలే మన భవిష్యత్తు. అందుకే వారి అవసరాలు, చదువు, నడవడి మీద ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. ఆరోగ్యం మీదా శ్రద్ధ తీసుకుంటాం. కానీ పిల్లల ఆరోగ్యంపై హార్మోన్లు ప్రభావం చూపు తాయన్న విషయమే పెద్దగా తెలియదు. ఆ మాటకొస్తే– హార్మోన్ల సమస్యలు పెద్దవారికే పరిమితమని భావిస్తుంటాం. ఇవి పిల్లల్లోనూ ఎక్కువే. ఇటీవల మరింత ఎక్కువవుతున్నాయి కూడా. చిక్కేంటంటే– హార్మోన్ల హెచ్చుతగ్గులతో పొడసూపే లక్షణాలు అంత ప్రస్ఫుటంగా లేకపోవటం. వీటిని సకాలంలో గుర్తించి, చికిత్స చేయగలిగితే పిల్లల ఆరోగ్యం, భావి జీవితం గాడి తప్పకుండా చూసుకోవచ్చు.పిల్లలే మన భవిష్యత్తు. అందుకే వారి అవసరాలు, చదువు, నడవడి మీద ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. ఆరోగ్యం మీదా శ్రద్ధ తీసుకుంటాం. కానీ పిల్లల ఆరోగ్యంపై హార్మోన్లు ప్రభావం చూపు తాయన్న విషయమే పెద్దగా తెలియదు. ఆ మాటకొస్తే– హార్మోన్ల సమస్యలు పెద్దవారికే పరిమితమని భావిస్తుంటాం. ఇవి పిల్లల్లోనూ ఎక్కువే. ఇటీవల మరింత ఎక్కువవుతున్నాయి కూడా. చిక్కేంటంటే– హార్మోన్ల హెచ్చుతగ్గులతో పొడసూపే లక్షణాలు అంత ప్రస్ఫుటంగా లేకపోవటం. వీటిని సకాలంలో గుర్తించి, చికిత్స చేయగలిగితే పిల్లల ఆరోగ్యం, భావి జీవితం గాడి తప్పకుండా చూసుకోవచ్చు.

మన శరీరంలో బోలెడన్ని గ్రంథులుంటాయి. హార్మోన్లు వీటి నుంచే విడుదలవుతాయి. రసాయన సమాచార వాహకాలుగా పనిచేసే ఇవి శరీరంలో జరిగే రకరకాల ప్రక్రియలను నియంత్రిస్తుంటాయి. శరీర ఎదుగుదల, బుద్ధి కుశలత, యౌవనదశ ఆరంభం, గ్లూకోజు జీవక్రియ, ఎముకల పటుత్వం, మానసిక ధోరణి, నిద్ర దగ్గరి నుంచి రక్తపోటు, జీవ ద్రవాలు, లవణాల నియంత్రణ వరకూ ఎన్నెన్నో పనుల్లో పాలు పంచుకుంటాయి. నిజానికి గ్రంథుల వ్యవస్థ పనిచేయటం పిండస్థ దశ నుంచే మొదలవుతుంది. పిండం ఎదుగుదలకు తోడ్పడటమే కాదు.. స్త్రీ, పురుష లింగాన్ని నిర్ణయించటంలోనూ హార్మోన్లే కీలకం. పిట్యూటరీ, థైరాయిడ్, పారాథైరాయిడ్, క్లోమ గ్రంథులతో పాటు అండాశయాలు, వృషణాలు కూడా హార్మోన్లను విడుదల చేస్తుంటాయి. కొందరిలో ఇవి అవసరమైన దాని కన్నా తక్కువ ఉత్పత్తి కావొచ్చు. కొందరిలో ఎక్కువగానూ విడుదల కావొచ్చు. ఇదే సమస్యలకు దారితీస్తుంటుంది. పిల్లల్లో వచ్చే హార్మోన్ల సమస్యల్లో చాలా రకాలే ఉన్నాయి. వీటిల్లో థైరాయిడ్, అడ్రినలిన్, క్లోమం, పిట్యూటరీ గ్రంథితో ముడిపడిన సమస్యలను ప్రధానంగా చెప్పుకోవాల్సి ఉంటుంది.

**థైరాయిడ్ గండం**

పిల్లల్లో తలెత్తే హార్మోన్ల సమస్యల్లో ముఖ్యమైంది హైపోథైరాయిడిజమ్. దీనికి మూలం థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోవటం. ఫలితంగా గ్రంథి నుంచి టీ3, టీ4 హార్మోన్ల విడుదల దెబ్బతింటుంది. శరీరం సక్రమంగా పనిచేయటానికి తోడ్పడే ఈ హార్మోన్లు లోపిస్తే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. తగినంత ఎత్తు ఎదగకపోవటం, క్రమంగా బరువు పెరగటం, మలబద్ధకం, చలి తట్టుకోలేకపోవటం.. చర్మం, వెంట్రుకలు పొడిబారటం, త్వరగా అలసిపోవటం, కండరాల నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. కొందరికి యౌవనదశ/రజస్వల ఆలస్యం కావొచ్చు. కొందరికి ముందుగానే మొదలవ్వచ్చు. ఇలాంటి లక్షణాలను గుర్తిస్తే హైపోథైరాయిడిజమ్ కావొచ్చని అనుమానించాలి. ముఖ్యంగా మెడ వద్ద ఉబ్బు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు. థైరాయిడ్ హార్మోన్ పరీక్ష (టీఎఫ్టీ) చేస్తే సమస్య ఉందో లేదో తెలుస్తుంది. ఒకసారి జబ్బును నిర్ధరిస్తే చికిత్స తేలికే. రోజుకు ఒకసారి పరగడుపున థైరాయిడ్ మాత్ర వేసుకుంటే చాలు. తరచూ పరీక్ష చేయిస్తూ మందు మోతాదులను మార్చుకోవాల్సి ఉంటుంది. చాలామందికిది జీవితాంతం అవసరమవుతుంది.

**పుట్టుకతోనే:** కొందరికిది పుట్టుకతోనే (కంజెనటల్) థైరాయిడ్ సమస్య ఉండొచ్చు. థైరాయిడ్ గ్రంథి అసలే ఏర్పడకపోవటం, ఏర్పడినా చిన్నగా ఉండటం, మెడలో వేరే చోట ఉండటం వంటివి దీనికి దోహదం చేస్తుంటాయి. ఇది పిల్లల్లో విషయ గ్రహణ సామర్థ్యాన్ని, బుద్ధి కుశలతను దెబ్బతీస్తుంది. కాబట్టి వీలైనంత త్వరగా గుర్తించటం ముఖ్యం. కనీసం 2 వారాల వయసు నుంచే హార్మోన్ ఇచ్చి, చికిత్స చేస్తే మందబుద్ధిని నివారించుకోవచ్చు. కాకపోతే పుట్టినప్పుడు దీని లక్షణాలు గుర్తించటం అంత తేలిక కాదు. దీంతో లోలోపలే మెదడు దెబ్బతింటూ వస్తుంది. ఒకసారి మెదడు దెబ్బతింటే దాన్ని వెనక్కి మళ్లించటం అసాధ్యం. అందువల్ల పిల్లలందరికీ పుట్టిన వెంటనే రక్త పరీక్ష చేస్తే దీన్ని ముందే పట్టుకోవచ్చు. పుట్టుకతో వచ్చే హైపోథైరాయిడిజమ్ శాశ్వతంగా ఉండొచ్చు. కొందరికి కొంతకాలం తర్వాత తగ్గొచ్చు. టీ4 హార్మోన్ చికిత్సతో సమస్య కుదురుకుంటుంది. ఒకవేళ స్వల్పకాల సమస్యగా అనుమానిస్తే రెండు, మూడేళ్ల తర్వాత చికిత్సను ఆపేసి చూడాల్సి ఉంటుంది.

**మధుమేహ ప్రమాదం**

పెద్దవారిలోనే కాదు.. పిల్లల్లోనూ ఇప్పుడు మధుమేహం ఎక్కువవుతోంది. వీరిలో ప్రధానంగా కనిపించేది టైప్ 1 రకం మధుమేహం. దీనికి మూలం క్లోమగ్రంథిలో ఇన్సులిన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసే బీటా కణాలు పనిచేయకపోవటం. రక్తంలో గ్లూకోజు మోతాదులను నియంత్రించటానికి ఇన్సులిన్ తప్పనిసరి. అందువల్ల టైప్ 1 మధుమేహానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకోవటం తప్ప మరో మార్గం లేదు. ఎక్కువసేపు పనిచేసే (బేసల్), తక్షణం పనిచేసే (బోలస్) ఇన్సులిన్లు కలగలసిన విధానం పిల్లలకు బాగా ఉపయోగ పడుతుంది. బేసల్ రకం రోజంతా ఇన్సులిన్ మోతాదులు స్థిరంగా ఉండేలా చేస్తే.. భోజనానికి ముందు తీసుకునే బోలస్ రకమేమో గ్లూకోజు మోతాదులు ఉన్నట్టుండి పెరగకుండా నిలువరిస్తుంది. రోజుకు కనీసం 4–5 ఇంజెక్షన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇవి మధుమేహంతో ముంచుకొచ్చే సమస్యల ముప్పు తగ్గటానికే కాకుండా, అవి తీవ్రం కాకుండానూ కాపాడతాయి. గ్లూకోమీటర్‌తో గానీ చర్మానికి అతికించుకునే సెన్సర్ల ద్వారా గానీ రక్తంలో గ్లూకోజు మోతాదులను నిరంతరం గమనిస్తూ ఉండటం చాలా ముఖ్యం. అలాగే పిండి పదార్థాలు తక్కువ తక్కువగా తీసుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం వంటి జాగ్రత్తలూ తీసుకోవాలి.

కణాలు ఇన్సులిన్‌కు స్పందించకపోవటం వల్ల తలెత్తే టైప్ 2 మధుమేహం కూడా పిల్లల్లో అధికంగా కనిపిస్తోంది. అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవటం వంటివి ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఆరోగ్యకరమైన, ఇంట్లో వండిన ఆహారం తినటం, తగినంత మోతాదులో తినటం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండటం, వ్యాయామం చేయటం వంటి వాటితో దీన్ని ముందుగానే నివారించుకునే వీలుండటం గమనార్హం.

**లక్షణాలు, హెచ్చరిక సంకేతాలు**

పిల్లల్లో.. పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వరకూ హార్మోన్ల సమస్యలు ఎప్పుడైనా తలెత్తొచ్చు. ఇవి శారీరక ఎదుగుదల, భావోద్వేగాలు, సామాజిక సంబంధాల మీద గణనీయమైన ప్రభావం చూపిస్తాయి. అందువల్ల వీటిని సకాలంలో గుర్తించి, జాగ్రత్త పడటం చాలా ముఖ్యం. ఆయా లక్షణాలు, హెచ్చరిక సంకేతాలను బట్టి వీటిని అనుమానించొచ్చు.

బరువు అంతగా పెరగకపోవటం లేదా నెమ్మదిగా పెరగటం.

వయసుకు తగినంత ఎత్తు లేకపోవటం.

బరువు అధికంగా ఉండటం.

దాహం ఎక్కువగా వేయటం, తరచూ మూత్రానికి వెళ్లటం.

రక్తంలో గ్లూకోజు మోతాదులు అసాధారణంగా ఉండటం.

మెడ వద్ద ఉబ్బు.

యౌవన లక్షణాలు ముందే మొదలవటం.

అమ్మాయిల్లో రజస్వల ఆలస్యం కావటం.

మెడ, చంకలు, గజ్జల్లో చర్మం నల్లగా అవటం లేదా రంగు మారటం.

యుక్తవయసు ఆడపిల్లల్లో నెలసరి సరిగా కాకపోవటం.

జననాంగాలు భిన్నంగా ఉండటం.

పిల్లలను ఆడ, మగ అని నిర్ణయించలేకపోవటం.

**యౌవనం ముందుగానే..**

యౌవనదశలో పిల్లలు లైంగికంగా పరిపక్వం చెందుతూ వస్తుంటారు. ఇది మెదడులోని పిట్యూటరీ గ్రంథి నుంచి విడుదలయ్యే హార్మోన్లతో మొదలవుతుంది. ఈ హార్మోన్లు అమ్మాయిల్లో అండాశయాలకు, అబ్బాయిల్లో వృషణాలకు సంకేతాలు చేరవేస్తాయి. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు యౌవనం చాలా ముందే వస్తోంది. పిల్లలకు.. ముఖ్యంగా మధ్య, ఉన్నత వర్గాలకు చెందినవారికి మంచి పోషకాహారం అందుబాటులో ఉండటం, మొత్తంగా ఆరోగ్య పరిస్థితి మెరుగవటం వంటివి ఇందుకు దోహదం చేస్తుండొచ్చని భావిస్తున్నారు. కొందరు అమ్మాయిల్లో 8 ఏళ్లు, అబ్బాయిల్లో 9 ఏళ్లకు ముందే యౌవనం ఆరంభమవు తుండటం గమనార్హం. ఇది అమ్మాయిల్లో మరింత ఎక్కువగానూ కనిపిస్తోంది. వీరిలో 90% మందిలో దీనికి కారణమేంటనేది కచ్చితంగా తెలియదు. అందువల్ల త్వరగా యౌవన లక్షణాలు కనిపిస్తే కారణమేంటన్నది గుర్తించాలి. ఇవి ఎప్పుడు మొదలవుతున్నాయో తల్లిదండ్రులు గమనించటం ముఖ్యం. అమ్మాయిలకు చిన్నవయసులోనే రొమ్ములు పెరగటం లేదా జననాంగాల వద్ద వెంట్రుకలు మొలవటం.. అబ్బాయిలకు వృషణాల సైజు పెరగటం లేదా జననాంగాల వద్ద వెంట్రుకలు మొలవటం కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. రక్త పరీక్ష, ఎముకల వయసు గణన ద్వారా ముందుగానే యౌవనం ఆరంభమవుతుందేమో పరిశీలిస్తారు. అలాగే మెదడులో పిట్యూటరీ గ్రంథి స్థితిని తెలుసుకోవటానికి ఎంఆర్ఐ స్కాన్ చేయిస్తారు. అవసరమైతే యౌవన/రజస్వల వాయిదా వేయటానికి మందులు సూచిస్తారు. లేకపోతే శరీర ఎత్తు పరిమితమయ్యే ప్రమాదముంటుంది.

**ఎత్తుకు ఆటంకం**

సాధారణంగా పిల్లలు 18 ఏళ్ల వరకూ ఎత్తు పెరుగుతారని భావిస్తుంటారు. నిజానికి అమ్మాయిల్లో రజస్వల అయ్యాక రెండేళ్ల తర్వాత ఎత్తు పెరగటం ఆగుతుంది. అబ్బాయిల్లో 16–18 ఏళ్ల వయసులో ఎత్తు పెరగటం నిలిచిపోతుంది. దీనికి కారణం శరీరంలో పొడవైన ఎముకల చివర్లు అతుక్కుపోవటం. ఆ తర్వాత ఏం చేసినా ఎత్తు పెరగరు. పుట్టినప్పుడు పొడవు, ఆ తర్వాత ఎదుగుదల, పోషకాహారం, శారీరక శ్రమ, జన్యువులు, హార్మోన్ల మీద శరీర ఎత్తు ఆధారపడుతుంది. ముఖ్యంగా థైరాయిడ్ హార్మోన్లు, పిట్యూటరీ గ్రంథి నుంచి విడుదలయ్యే గ్రోత్ హార్మోన్లు, యౌవనదశలో లైంగిక హార్మోన్లు ఎత్తు మీద పెద్ద ప్రభావం చూపుతాయి. అందువల్ల పిల్లలు ఎత్తు పెరగటం లేదని గమనిస్తే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది. దీనికి హార్మోన్ల లోపం కారణమవుతుంటే వెంటనే హార్మోన్ల చికిత్స చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

**ఊబకాయ ఊబి**

ఊబకాయం పెద్ద ప్రజారోగ్య సమస్యగా మారింది. ఇది 5–19 ఏళ్ల పిల్లల్లో గణనీయంగా పెరుగుతోంది. ఇప్పుడు 0–5 ఏళ్ల పిల్లల్లోనూ అధిక బరువు, ఊబకాయం కనిపిస్తోంది. ఇందుకు జన్యువులు, కుటుంబ చరిత్ర, జీవనశైలి, కొన్నిరకాల మందులు, ఆహార అలవాట్ల వంటి రకరకాల అంశాలు కారణం కావొచ్చు. అంతేకాదు.. లెప్టిన్, ఘ్రెలిన్, ఇన్సులిన్, కార్టిజాల్, థైరాయిడ్, లైంగిక హార్మోన్ల పనితీరు అస్తవ్యస్తం కావటమూ దీనికి దోహదం చేయొచ్చు. దీన్ని ముందే అరికట్టటం ముఖ్యం. ఎందుకంటే బాలల్లో ఊబకాయం పెద్దయ్యాకా కొనసాగొచ్చు. అధిక రక్తపోటు, మధుమేహం, కాలేయానికి కొవ్వు పట్టటం, అధిక కొలెస్ట్రాల్, అమ్మాయిల్లో అండాశయాల్లో నీటి తిత్తుల (పీసీఓడీ) వంటి సమస్యల ముప్పు పెరగటానికీ కారణమవుతుంది. ఊబకాయంతో పిల్లలకు కుంగుబాటు (డిప్రెషన్), ఆత్మన్యూనత, ఆందోళన వంటి మానసిక సమస్యలు వచ్చే అవకాశమూ ఎక్కువే. కాబట్టి పిల్లల్లో ఊబకాయానికి కారణాలేంటన్నది కనుక్కోవాలి. చిన్నప్పటి నుంచే సమతులాహారం తినటం, తీపి పానీయాలు పరిమితం చేయటం, డిజిటల్ పరికరాల వాడకాన్ని తగ్గించటం, శారీరక శ్రమ చేసేలా ప్రోత్సహించటం వంటివి అలవాటు చేస్తే బరువు మరీ పెరగకుండా చూసుకోవచ్చు.

# సూర్యా.. సక్సెస్ లేని టైమ్ లో రిస్కీ క్లాష్?



కోలీవుడ్ స్టార్ హీరో సూర్యా తన తదుపరి థియేట్రికల్ రిలీజ్ కోసం సిద్ధమవుతున్నాడు. ఆ సినిమా పేరు 'కరుప్పు'. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం సూర్యా కెరీర్‌లో ఒక విభిన్న యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటోంది. మొదట దీపావళి రిలీజ్ అనుకున్నారు కానీ ఇప్పటివరకు రిలీజ్ డేట్‌పై అధికారిక ప్రకటన రాలేదు. తాజా సమాచారం ప్రకారం ఇప్పుడు పొంగల్ 2026 రిలీజ్ ప్లాన్ కూడా పరిశీలనలో ఉందని చెబుతున్నారు.

సూర్యా అభిమానులు ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ పూర్తయినప్పటికీ, నాన్ థియేట్రికల్ డీల్స్ ఇంకా క్లోజ్ కాలేదనే కారణంగా రిలీజ్ డేట్‌ను ప్రకటించలేదు. టీజర్ మాత్రం విడుదలైంది. టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చినా, సినిమా బజ్ మాత్రం అంచనాలకు తగ్గట్టు పెరగలేదు. సూర్యా గతంలో ఎదుర్కొన్న కొన్ని వైఫల్యాల కారణంగా 'కరుప్పు క్రేజ్ తక్కువగా ఉందన్నది ఇండస్ట్రీ టాక్.

**పొంగల్ రిలీజ్ రిస్క్**


కరుప్పు పొంగల్ 2026కి వస్తే, ఇది నిజంగా పెద్ద రిస్క్ అనే చెప్పాలి. ఎందుకంటే అదే సమయంలో విజయ్ నటిస్తున్న 'జన నాయకన్' సినిమా రిలీజ్ అవుతోంది. శివకార్తికేయన్ 'పరాశక్తి' కూడా అదే సీజన్‌కి వస్తోంది. ఈ రెండు సినిమాలకు ఉన్న అంచనాలు, మార్కెట్, స్క్రీన్లు సూర్యా సినిమాను బలహీనంగా మార్చే అవకాశం ఉంది. కాబట్టి సూర్యా సినిమా స్క్రీన్ కౌంట్ తగ్గిపోవడం ఖాయం.

**తెలుగు మార్కెట్ పరిస్థితి**

కరుప్పు తెలుగు వెర్షన్ విషయానికి వస్తే పరిస్థితి మరింత క్లిష్టంగా కనిపిస్తోంది. ఎందుకంటే పొంగల్ 2026లో ఇప్పటికే పెద్ద సినిమాలు రెడీగా ఉన్నాయి. ప్రభాస్ 'రాజాసాబ్', చిరంజీవి అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్న సినిమా, నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఒక రాజు' అన్నీ రిలీజ్ అవుతున్నాయి. వీటికి తోడు జన నాయకన్, పరాశక్తి డబ్ వెర్షన్లు కూడా వస్తాయి. ఈ పరిస్థితుల్లో కరుప్పు తెలుగు వెర్షన్‌కు పెద్ద స్థాయి స్క్రీన్లు దొరకడం కష్టం.

**దీపావళి సేఫ్ బెట్**

ఇండస్ట్రీ వర్గాల అంచనా ప్రకారం కరుప్పు దీపావళికి రిలీజ్ అయితే మంచి థియేట్రికల్ కౌంట్ దక్కుతుంది. తమిళంలోనూ, తెలుగులోనూ ఇది ఆడియన్స్‌కు ప్రథమ ఎంపికగా మారే అవకాశం ఉంది. ఫెస్టివల్ హాలిడే సీజన్‌లో కరుప్పు లాంటి మాస్ యాక్షన్ డ్రామా పెద్ద పాజిటివ్ ఇంపాక్ట్ క్రియేట్ చేసే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. మొత్తం మీద, కరుప్పు విడుదలపై క్లారిటీ త్వరలో రానుంది. పొంగల్ 2026 క్లాష్ అంటే సూర్యాకు రిస్క్ తప్పదు. కానీ దీపావళి రిలీజ్ అయితే మాస్ రెస్పాన్స్‌తో పాటు మంచి స్క్రీన్ కౌంట్ కూడా దక్కే అవకాశం ఉంది. ఫైనల్ గా సూర్యా, ఆర్జే బాలాజీ టీమ్ ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



ఎడిన్ రోజ్ సన్‌షైన్‌లో ఎల్లో ఎ స్టైల్ స్టేట్‌మెంట్‌లో ప్రకాశవంతంగా మెరిసింది



ఇనాయా సుల్తానా చీరతో సంస్కారీగా ఉంటుంది

## ఎంపికలతోనే కియరాకు ఇలాంటి చిక్కులు!



కెరీర్ లో నటించినవన్నీ భారీ క్రేజ్ ఉన్న సినిమాలే. ప్రతిసారీ అగ్రహీరోల సరసన అవకాశాలొచ్చాయి. కానీ ఈ భామకు సరైన బ్లాక్ బస్టర్ పడటం చాలా కష్టమే అవుతోంది. ఇటీవల అరడజను ఫ్లాపుల తర్వాత వార్ 2 రూపంలో అయినా సక్సెస్ చేతికి అందుతుందని భావించింది. కానీ మొదటిరోజు నిరాశపరిచే రివ్యూలతో అది కూడా ఆవిరైపోయింది. వార్ 2 మొదటి వీకెండ్ నాటికి కేవలం 200 కోట్లు వసూలు చేసింది. సోమవారం నుంచి టికెట్ విండో వద్ద ఊపు తగ్గిపోయిందని ట్రేడ్ విశ్లేషిస్తోంది.

**చాన్నాళ్లుగా దక్కనిది...**

నిజానికి భూల్ భులయా 3 తర్వాత కియరాకు అసలు విజయ అన్నదే లేదు. రామ్ చరణ్ సరసన శంకర్ దర్శకత్వంలో నటించిన %-%గేమ్ ఛేంజర్%-% భారీ హైప్ నడుమ విడుదలై ఘోరమైన డిజాస్టర్ గా మారింది. ఇది నిజానికి చరణ్, శంకర్ లతో పాటు కియరాను కూడా తీవ్రంగా నిరాశపరిచింది. అప్పటికి %-%దేవర%-%లో అవకాశం వచ్చినా కానీ గేమ్ ఛేంజర్ కోసం ఆ అవకాశాన్ని వదులుకుందన్న టాక్ కూడా ఉంది. జగ్ జగ్ జియో, గోవిందా నామ్ తేరా, సత్య ప్రేమ్ కి కథ వంటి సినిమాలు కూడా ఆశించినంత బ్లాక్ బస్టర్లు కాలేదు. దీంతో చాలా కాలంగా కియరా నిరాశలోనే ఉంది.

**ఈ రెండిటితో రియలైజేషన్:**

ఇప్పుడు చాలా హోప్స్ పెట్టుకుని ఎదురు చూసిన %-%వార్ 2%-% చిత్రంపై సమీక్షకులు విరుచుకుపడటంతో తన ఎంపికల విషయంలో ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. హృతిక్, ఎన్టీఆర్ లాంటి అగ్ర హీరోల సరసన అవకాశం వచ్చినా, తన పాత్రలో అంతో ఇంతో విషయం ఉన్నా కానీ, స్క్రిప్టులో మ్యాటర్ లేకపోతే ఓవరాల్ గా ఫలితం ఎలా ఉంటుందో కియరాకు %-%గేమ్ ఛేంజర్%-% తర్వాత వెంటనే %-%వార్ 2%-%తో తెలిసొచ్చింది. కాబట్టి భవిష్యత్ లో స్క్రిప్టులో ప్రత్యేకతను కూడా గెస్ చేయడం నేర్చుకోవాల్సి ఉంది. ఇప్పటి ఈ రియలైజేషన్ నెక్స్ట్ ఎంపికపై ప్రభావం చూపుతుందేమో చూడాలి. పెద్ద స్టార్లు, పెద్ద స్టార్ డైరెక్టర్, బడా నిర్మాతలు మాత్రమే తనకు గొప్ప విజయాన్ని ఇవ్వలేరు. ఇప్పుడు కియరా కూడా ఒక నిత్యా మీనన్ లా, సాయిపల్లవిలా కిందికి దిగి వచ్చి ఆలోచించగలగాలి.

**ఆదుకునేది ఇదొక్కటే...**

ఈ క్లిష్ట సమయంలో కియరాను ఆదుకునేది %-%టాక్సిక్%-% ఒక్కటే. కేజీఎఫ్ యష్ లాంటి ట్యాలెంటెడ్ హీరో సరసన కియరాకు అరుదైన అవకాశమిది.. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రకరకాల కారణాలతో విడుదల అంతకంతకు ఆలస్యమవుతోంది. గేమ్ ఛేంజర్, వార్ 2 రేంజులో పాన్ ఇండియాలో విడుదలయ్యే మరో చిత్రం కావడంతో కియరా హోప్స్ అన్నీ ఈ సినిమాపైనే.